1 St Year
Happy Work Anniversary.

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 168 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ గురువారం 08 మే 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 168 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Thursday 08 May 2025 PAGES : 8 PRICE : 3/-

## చివరి ఉగ్రవాదిని ఏరివేసే వరకు
# ‘ఆపరేషన్ సింధూర్’
## కొనసాగాలి

- పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై దాడులు చేసి భారత్ ధీటైన జవాబిచ్చింది
- ఉగ్రవాదంపై పోరాటంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి యావత్ జాతి మద్దతిస్తుంది
- క్లిష్ట పరిస్థితుల్లో ప్రతి పౌరుడూ బాధ్యతగా వ్యవహరించాలి
- సామాజిక మాధ్యమాల్లో ఇష్టానుసారం పోస్టులు పెట్టొద్దు
- భారత సైన్యాన్ని కించపరచినా...
- దేశ సమగ్రతకు విఘాతం కలిగేలా పోస్టులు పెట్టినా కఠిన చర్యలు
- కాంగ్రెస్‌లో కొందరు నాయకులు తమ వైఖరిని మార్చుకుంటే మంచిది
- హైదరాబాద్‌లో మీడియాతో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 7)

‘భారతదేశ సమగ్రతను దెబ్బ తీసేందుకు ప్రయత్నించి, పహల్గాంలో 26 మంది సామాన్యులను బలిగొన్న ఉగ్రవాదం దాడిని ప్రతి ఒక్కరం చూసాము. ఇందుకు ప్రతీకారం తీర్చుకోవాలని యావత్ దేశం ఎదురు చూసింది. చివరి ఉగ్రవాదిని అంతం చేసే వరకు ఆపరేషన్ సింధూర్ ఆగకూడదు’ అని ఏపీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు. ఉగ్రవాదంపై పోరాటంలో ప్రధాని నరేంద్ర మోదీ తీసుకునే ప్రతి నిర్ణయానికి ప్రతి భారతీయుడి సంపూర్ణ మద్దతు ఉంటుందని చెప్పారు. ఈ కీలక సమయంలో దేశ ప్రజలంతా ఏకతాటిపై నిలిచి, ఐక్యతను ప్రదర్శించాలన్నారు. దేశంపై జరిగిన దాడిని ప్రతి ఒక్కరు తీవ్రంగా పరిగణించాలని, భారత సైన్యం చర్యలకు వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేస్తే వారిపై కఠిన చర్యలు తెలియజేసామని బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసం వద్ద మీడియా సమావేశంలో తెలిపారు. ఆపరేషన్ సింధూర్ కు పూర్తి స్థాయిలో మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ “పాకిస్థాన్ లోని ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకుని భారత సైన్యం చేపట్టిన -మిగతా 2లో

## మన జలాలను దేశం దాటనివ్వం




(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 7)

దిల్లీ: భారత జలాలను ఇక నుంచి దేశం దాటనివ్వబోమని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. దేశ ప్రయోజనాల కోసమే వాటిని వినియోగిస్తామని తేల్చి చెప్పారు. పాక్‌తో అమల్లో ఉన్న సింధూ -మిగతా 2లో

## ఢిల్లీలో అమిత్ షా అత్యవసర సమీక్ష... నేడు అఖిలపక్ష సమావేశం

పహల్గామ్ ఉగ్రదాడికి బదులుతీర్చుకున్న భారత్
పీవోకేలోని ఉగ్రవాద శిబిరాలపై దాడులు
ఆపరేషన్ సిందూర్ విజయవంతం
పాక్, నేపాల్ సరిహద్దు రాష్ట్రాలతో సీఎంలతో అమిత్ షా వీడియో కాన్ఫరెన్స్

4



## ఉగ్రవాదులను అంతం చేయాల్సిందే....

ఉగ్రవాద శిబిరాలపై దాడులు అనివార్యం: జగన్
దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడం ముఖ్యమైన కర్తవ్యమన్న జగన్
ఉగ్ర చర్యలను మన రక్షణ దళాలు తిప్పికొట్టాయని వ్యాఖ్య
ఆపరేషన్ సిందూర్ అనివార్యమైన చర్య అన్న వైసీపీ అధినేత



(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 7)

దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు, ఉగ్రవాదుల దాడుల నుంచి పౌరులను రక్షించేందుకు చేపట్టే చర్యల్లో భాగంగా ‘ఆపరేషన్ సిందూర్’ వంటివి అనివార్యమని వైఎసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గాల పరిశీలకులు, రీజినల్ కోఆర్డినేటర్లతో సమావేశమయ్యారు. ఈ భేటీకి ముందు కొందరు ముఖ్య నేతలతో ఆయన ‘ఆపరేషన్ సిందూర్’ గురించి ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... ఉగ్రవాద స్థావరాలు, వారి శిక్షణ శిబిరాలపై దాడులు చేయడం అనేది దేశ రక్షణలో కీలకమైన భాగమని అభిప్రాయపడ్డారు. “దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడం, ఉగ్రవాదుల దాడుల నుంచి తన పౌరులను రక్షించుకోడం అన్నది దేశానికి అత్యంత ముఖ్యమైన కర్తవ్యం” అని ఆయన స్పష్టం చేశారు.కశ్మీర్‌లోని పహల్గామ్ లో అమాయకులైన పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడిని జగన్ తీవ్రంగా ఖండించారు. ఇది మానవత్వంపై జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు. ఇటువంటి క్రూరమైన ఉగ్ర చర్యలను -మిగతా 2లో

## ఈ రెండు ఆయుధాలతో... 9 ఉగ్ర లక్ష్యాలను తుత్తునియలు చేసిన భారత్

పహల్గామ్ దాడికి బదులుగా ‘ఆపరేషన్ సింధూర్’
పీఓకే, పాక్ పంజాబ్‌లో ఉగ్ర స్థావరాలు ధ్వంసం
జైషే, లష్కరేకు చెందిన 80 మంది ఉగ్రవాదుల మృతి
మసూద్ అజార్ కుటుంబసభ్యులు 10 మంది హతం
స్కాల్ప్, హామర్ క్షిపణులతో నిర్దిష్ట లక్ష్యాలపై దాడులు






(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 7)

పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడికి ప్రతిగా, భారత భద్రతా దళాలు ‘ఆపరేషన్ సింధూర్’ చేపట్టడం తెలిసిందే. పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే) తో పాటు పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో గల 9 చోట్ల ఉగ్రవాద స్థావరాలపై నిర్దిష్ట దాడులు చేపట్టాయి. ఈ దాడుల్లో జైషే మహ్మద్, లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థలకు చెందిన సుమారు 80 మంది ముష్కరులు హతమైనట్లు తెలుస్తోంది. ముఖ్యంగా, బహావల్పూర్‌లోని జైషే చీఫ్ మసూద్ అజార్ కుటుంబానికి చెందిన 10 మంది కూడా ఈ దాడుల్లో మరణించినట్లు సమాచారం.

**అత్యాధునిక ఆయుధాల వినియోగం**

ఈ ఆపరేషన్‌లో భారత వాయుసేన ఉపయోగించిన ఆయుధాలు ప్రస్తుతం అంతర్జాతీయంగా చర్చనీయాంశమయ్యాయి. ప్రధానంగా రాఫెల్ యుద్ధ విమానాలకు అమర్చిన స్కాల్ప్ క్రూయిజ్ క్షిపణులు, హామర్ (హైలీ అజైల్ మాడ్యులర్ మ్యూనిషన్ ఎక్స్‌టెండెడ్ రేంజ్) ప్రెసిషన్-గైడెడ్ ఆయుధాలను ఈ దాడుల కోసం ఎంచుకున్నట్లు తెలుస్తోంది. పౌరులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా, కేవలం ఉగ్రవాద శిబిరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని ఈ రెండు అత్యాధునిక ఆయుధాలను ప్రయోగించినట్లు సమాచారం.

**స్కాల్ప్ క్షిపణి... ఇది చిక్కదు దొరకదు!**

‘స్టార్మ్ షాడో’గా కూడా పిలువబడే స్కాల్ప్ క్షిపణి, సుదూర లక్ష్యాలను ఛేదించడానికి రూపొందించబడింది. ఇది శత్రు రాడార్లకు చిక్కకుండా ప్రయాణించగల (స్టెల్త్) లక్షణాలను కలిగి ఉంది. -మిగతా 2లో

## ఉద్రిక్తతలను పెంచే ఉద్దేశం భారత్‌కు లేదు..




(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 7)

‘ఆపరేషన్ సిందూర్’ పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం దాడులు జరిపిన విషయం గురించి భారత జాతీయ భద్రత సలహాదారు అజిత్ డోభాల్ ఇతర దేశాలకు వెల్లడిస్తూ.. వారి మద్దతు కూడగడుతున్నారు. ఇందులో భాగంగా ఆయన చైనా విదేశాంగ మంత్రితో మాట్లాడారు. -మిగతా 2లో

## ఇది మాక్‌డ్రిల్.. ఎవరూ భయభ్రాంతులకు లోనుకావొద్దు

హైదరాబాద్‌లో వైమానిక దాడుల మాక్‌డ్రిల్
హైదరాబాద్‌లో సాయంత్రం 4 గంటలకు సైరన్లు
అప్రమత్తతే లక్ష్యంగా హైదరాబాద్‌లో విపత్తు నిర్వహణ డ్రిల్
లోపాలను సమీక్షించి, సరిదిద్దుతామని సీపీ వెల్లడి

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 7)

హైదరాబాద్ నగరంలో ఈరోజు సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఒక్కసారిగా సైరన్లు మోగిన ఘటన నగరవాసులను ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే, ఇది కేంద్ర -మిగతా 2లో



# ‘ఆపరేషన్ సిందూర్’ బ్రీఫింగ్..
## ఎవరీ సోఫియా, వ్యోమికా..?



(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 7)

పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. పాక్, పీఓకేలోని తొమ్మిది ఉగ్ర స్థావరాలపై విజయవంతంగా దాడులు నిర్వహించింది. ఈ మెరుపు దాడులకు సంబంధించిన వివరాలను కేంద్ర రక్షణ, విదేశాంగ శాఖ బ్రీఫింగ్ ఇచ్చింది. భద్రతా బలగాలకు చెందిన ఇద్దరు మహిళలు దాడుల వివరాలు వెల్లడించడం అందరి దృష్టినీ ఆకర్షించింది. ఇంత క్లిష్టమైన ఆపరేషన్ గురించి దేశ ప్రజలకు వెల్లడించిన వారిద్దరే.. కర్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ఎవరీ కర్నల్ సోఫియా ఖురేషి..? గుజరాత్‌కు చెందిన సోఫియా.. బయోకెమిస్ట్రీలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఆమెకు పీస్ కీపర్‌గా అపార అనుభవం ఉంది. ఐరాసకు చెందిన పీస్ మిషన్‌లో భాగంగా 2006లో కాంగోలో విధులు నిర్వర్తించారు. 2016లో పుణెలో జరిగిన ‘ఎక్సర్‌సైజ్ 18’ పేరిట భారత ఆర్మీకి చెందిన బృందానికి నాయకత్వం వహించి చరిత్ర సృష్టించారు. అది మల్టీ నేషనల్ మిలిటరీ ఎక్స్‌ర్‌సైజ్. దానిలో 18 దేశాలు పాల్గొన్నాయి. అన్ని దేశాలు ఉన్నప్పటికీ.. ఒక్క భారత్ బృందానికి మాత్రమే మహిళ నాయకత్వం వహించడం గమనార్హం. అప్పుడు బలగాలు శాంతి పరిరక్షక కార్యకలాపాలు, మందుపాతర తొలగింపుపై దృష్టిసారించాయి. 1990ల్లో సోఫియా సైన్యంలో చేరారు. ఆర్మీ సిగ్నల్ -మిగతా 2లో

మొదటి పేజీ తరువాయి

# చివరి ఉగ్రవాదిని ఏరివేసే వరకు 'ఆపరేషన్ సింధూర్' కొనసాగాలి

ఆపరేషన్ సింధూర్ ను ప్రతి ఒక్కరూ అందరూ స్వాగతిస్తున్నారు. పాక్ సైనిక కేంద్రాల జోలికి పోకుండా, సాధారణ పౌరులకు ఇబ్బందులు కలుగకుండా ఉగ్రవాద సంస్థలకు చెందిన శిబిరాలే లక్ష్యంగా భారత సైన్యం ముందుకు సాగడం అభినందనీయం. క్లిష్ట పరిస్థితుల్లో ప్రధాని నరేంద్ర మోదీ తీసుకునే ప్రతి నిర్ణయానికి ప్రజలంతా కట్టబడి ఉండాలి. భారతదేశ ఐక్యతను చాటాలి.

ఉగ్ర దాడులకు బదులివ్వాలని

**ప్రతి ఒక్క భారతీయుడూ కోరుకున్నాడు**

ఏప్రిల్ 22వ తేదీన పెహల్గాంలో ఉగ్రవాదులు మతం పేరుతో మారణహోమం సృష్టించారు. 26 మంది పర్యటకులను దారుణంగా చంపేశారు. ఈ ఘటనతో దేశం మొత్తం శోకంలో మునిగిపోయింది. హిందువా? ముస్లింమా? అని అడిగి పర్యాటకులను చంపిన విధానం దారుణం. కలిమా చదవమని హిందువా, ముస్లిం అని గుర్తించి మరీ చంపారు. ఇలాంటి ఘాతుకానికి దేశం సరైన రీతిలో బదులివ్వాలని ప్రతి ఒక్క భారతీయుడు కోరుకున్నాడు. గత రాత్రి భారత సైన్యం 9 ప్రధాన ఉగ్రవాద స్థావరాలపై వైమానిక దాడులు చేయడంతో మనం ఆపరేషన్ సింధూర్ ను ప్రారంభించాం. భారత సైన్యం వెళ్లి, ఉగ్రవాద సంస్థలకు చెందిన శిబిరాలపై దాడులు చేసి ధ్వంసం చేయడం ద్వారా ఉగ్రవాదులకు భారత్ ఇచ్చిన జవాబు హర్షణీయం.

**ప్రతిసారి సహనం.. సహనం అంటూనే ఉన్నాం**

కశ్మీర్ భారత దేశంలో అంతర్భాగం. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రమూకలు కాశ్మీరీ పండిట్లను చంపేశారు. అంత్యక్రియలు చేయడానికి శ్మశానానికి తీసుకువెళ్లిన వారిని కూడా చంపేశారు. హిందువుల మీద దాడి అనాదిగా జరుగుతూనే ఉంది. సరైన సమయంలో సరైన చర్య మోదీ తీసుకున్నారు. మన ఆర్మీ చేపడుతున్న చర్యలకు మద్దతు ఇస్తున్నాం. మేమంతా మీతో ఉన్నాం. ప్రత్యేకించి యుద్ధం సమయంలో పాకిస్తాన్ కి గట్టి పాఠం నేర్పాల్సి ఉంది. గతంలో లుంబినీ పార్క్, గోకుల్ చాట్ తదితర ప్రాంతాల్లో దాడులు జరిగాయి. ఏ ఘటన జరిగినా, ఎలాంటి ఉపద్రవం ఎదురైనా– సహనం, శాంతి అంటూనే ఇంతవరకు తెచ్చుకున్నాం. ఇప్పుడు గట్టిగా గుణపాఠం చెప్పాల్సిన సమయం వచ్చింది. మితిమీరిన సహనంతో చేతులు కట్టేసిన సమస్త భారతానిలో ఆపరేషన్ సిందూర్ తిరిగి వీరత్వాన్ని నింపింది.

**సెలబ్రిటీలు సైతం బాధ్యతగా వ్యవహరించాలి**

మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదాన్ని అణగదొక్కేందుకు కఠిన చర్యలు తీసుకుంటోంది. మిలటరీ బలగాలు యుద్ధం చేస్తున్నప్పుడు, ఎవరూ జాతీయ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఆ తరహా కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. సామాజిక మాధ్యమాల్లో బాధ్యతారాహిత్యంగా పోస్టులు పెట్టవద్దు. సోషల్ మీడియాలో ఇష్టారాజ్యంగా కుక్కలా మొరగవద్దు. క్లిష్ట సమయంలో మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలి. త్రివిధ పోరాట పోరాటాన్ని కించపరచేలా, దేశ సమగ్రతకు భంగం వాటిల్లేలా ఎవరు కామెంట్స్ చేసినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ డీజీపీకి సూచించామని తెలిపారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "దేశాన్ని సెలబ్రెటీలు నడిపించడం లేదు. వారే దేశం మొత్తం గొంతుక కాదు అని గుర్తుంచుకోవాలి. వారు కూడా ఈ తరుణంలో బాధ్యతగా దేశ సమగ్రతలా మాట్లాడాలి. పాకిస్థాన్ మీద ప్రేమ ఉంటే అక్కడికే వెళ్లిపోవాలి అనే మాట పాకిస్థాన్ కి అనుకూలంగా మాట్లాడే కొద్దిమంది కాంగ్రెస్ నాయకులు అని మాత్రమే చెప్పాను. నేను చేసిన వ్యాఖ్యలకు జవాబుదారీతనంగా ఉంటాను. క్లిష్ట సమయంలో ప్రభుత్వానికి అండగా నిలబడాలి. పాకిస్తాన్‌కు మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ నాయకులకు మాత్రమే నేను చెప్పాను. వారు తమ వైఖరి మార్చుకుంటే మంచిదే కదా.. ఇది దేశం మొత్తం చేస్తున్న యుద్ధం. ఇలాంటి సమయంలో పాకిస్తాన్ కి మద్దతుగా మాట్లాడడం సరికాదని మాత్రమే చెప్పాను.

**ఘాజీ లాంటి సబ్ మెరైన్‌లు**
**విశాఖ వరకూ వచ్చాయని గుర్తుంచుకోవాలి**

ఎవరి పని వారు శ్రద్ధగా, నిబద్ధతతో జాతి ప్రయోజనాల కోసం చేసుకోవాలి. దేశాన్ని ప్రేమించాలి. ఉద్రిక్త పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో సహా అన్ని రాష్ట్రాలకు కేంద్రానికి మద్దతుగా నిలబడుతుంది. ఈ రోజు మాక్ డ్రిల్ దేశవ్యాప్తంగా జరుగుతోంది. ఎవరికి వారు బాధ్యతతో మాట్లాడాలి. సోషల్ మీడియాలో కూడా జాగ్రత్తగా ప్రవర్తించాలి. ఏ ఇష్టానుసారం మాట్లాడినా చట్ట ప్రకారం చర్యలు ఉంటాయి. కేవలం ఇది సరిహద్దుల్లో జరుగుతున్న వ్యవహారం కాదు. ఆంధ్రప్రదేశ్ కు కూడా 974 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది. ప్రమాదం ఎటు వైపు నుంచి అయినా మన మీదకు వచ్చే అవకాశం ఉంది. గతంలో ఘాజీ లాంటి సబ్ మెరైన్లు విశాఖ తీరం వరకు వచ్చాయంటే దాని అర్థం... మనకు ప్రమాదం అన్ని వైపుల నుంచి పొంచి ఉంది. కాబట్టి ప్రజలంతా నిరంతరం అప్రమత్తంగా ఉండటం ప్రధానం. అందులోనూ ఉద్రిక్త వాతావరణం మరింత జాగ్రత్త అవసరం" అన్నారు.

## ఉగ్రవాదులను అంతం చేయాల్సిందే....

భారత రక్షణ దళాలు సమర్థవంతంగా తిప్పికొట్టాయని ప్రశంసించారు. "అలాంటి ఉగ్ర చర్యలపై భారత రక్షణ దళాలు గట్టిగా స్పందించాయి. ఆపరేషన్ సిందూర్ అనివార్యమైన చర్య. భారత రక్షణ బలగాలకు యావత్‌దేశం అండగా నిలుస్తుంది" అని జగన్ తెలిపారు. దేశ పౌరుల భద్రత లక్ష్యంగా రక్షణ బలగాలు తీసుకుంటున్న ప్రతి చర్యకు దేశం మొత్తం మద్దతుగా ఉంటుందని ఆయన అన్నారు.

## ఈ రెండు ఆయుధాలతో... 9 ఉగ్ర లక్ష్యాలను తుత్తునియలు చేసిన భారత్

ఈ క్షిపణిని శత్రువులు పసిగట్టడం చాలా కష్టమని నిపుణులు పేర్కొంటున్నారు. విమానాల నుంచి ప్రయోగించగల ఈ క్రూయిజ్ క్షిపణిని ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు ఉపయోగిస్తున్నాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ ఇది సమర్థవంతంగా పనిచేస్తుంది.

450 కిలోమీటర్ల పరిధి కలిగిన స్కాల్ప్, అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదిస్తుంది. దీనిలో ఐఎన్ఎస్, జీపీఎస్, భూతల సంకేతాల ఆధారిత అత్యాధునిక నేవిగేషన్ వ్యవస్థ ఉంది. యూరోపియన్ కన్సార్టియం ఎంబీడీఏ దీనిని తయారు చేసింది. బంకర్లు, ఆయుధాగారాల్లోకి చొచ్చుకుపోయే శక్తి దీనికి ఉంది. లక్ష్యాన్ని సమీపించినప్పుడు, క్షిపణిలోని ఇన్‌ఫ్రారెడ్ సీకర్ టార్గెట్‌ను గుర్తించి, దానిలోకి చొచ్చుకుపోతుంది. ఇది 450 కిలోల బరువున్న వార్‌హెడ్‌ను మోసుకెళ్లగలదు.

**హామర్ గైడెడ్ బాంబు... శత్రువులకు సవాల్**

ఆపరేషన్ సింధూర్‌లో వినియోగించిన మరో కీలక ఆయుధం హామర్. ఇది అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ పనిచేయగల ఎయిర్–టు–సర్ఫేస్ ప్రెసిషన్ గైడెడ్ బాంబు. దీనిని 'గ్లైడ్ బాంబ్'గా కూడా వ్యవహరిస్తారు. ఇది దాదాపు 70 కిలోమీటర్ల పరిధిలో లక్ష్యాలను ధ్వంసం చేయగలదు. దీనికి 250, 500, లేదా 1000 కిలోల వార్ హెడ్ లను అమర్చవచ్చు. ఫ్రెంచ్ సంస్థ సఫ్రాన్ దీనిని ఉత్పత్తి చేస్తోంది. కఠినమైన భూభాగాలపై తక్కువ ఎత్తు నుంచి కూడా దీనిని ప్రయోగించవచ్చు. దీనిని అడ్డుకోవడం శత్రువులకు సవాల్‌తో కూడుకున్న పని. పటిష్టమైన భవనాల్లోకి సైతం చొచ్చుకుపోయే సామర్థ్యం హామర్‌కు ఉంది. జైషే మహ్మద్, లష్కరే తోయిబా కార్యాలయాలను ధ్వంసం చేయడానికి భారత్ ఈ ఆయుధాన్నే ప్రయోగించినట్లు తెలుస్తోంది.

## ఇది మాక్‌డ్రిల్.. ఎవరూ భయభ్రాంతులకు లోనుకావొద్దు

ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించిన సివిల్ మాక్‌డ్రిల్‌లో భాగమని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. ప్రజల్లో విపత్కర పరిస్థితులపై అవగాహన పెంచడంతో పాటు, వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయాన్ని పరీక్షించేందుకే ఈ సన్నాహక కార్యక్రమం చేపట్టామని, దీనిపై ఎవరూ భయభ్రాంతులకు లోనుకావాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లో మాక్‌డ్రిల్ పూర్తయిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, "పారిశ్రామిక సైరన్‌లు, పెట్రోల్ బంకుల వాహనాల సైరన్లు, పోలీస్ వాహనాల సైరన్లను ఏకకాలంలో మోగించాం. సైరన్ మోగిన వెంటనే ప్రజలు ఎక్కడివారు అక్కడే సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సూచనలు జారీ చేశాం. నగరంలోని నాలుగు వ్యూహాత్మక ప్రాంతాల్లో వైమానిక దాడులు జరిగినట్లుగా భావించి, మాక్‌డ్రిల్‌ను నిర్వహించాం" అని వివరించారు.

వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పనితీరు, వారి ప్రతిస్పందన సమయాన్ని ఈ మాక్‌డ్రిల్స్ ద్వారా అంచనా వేశామని కమిషనర్ తెలిపారు. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, రెవెన్యూ, జీహెచ్ఎంసీ, పురపాలక, పోలీస్, అగ్నిమాపక, విద్యుత్, రవాణా తదితర కీలక శాఖల సిబ్బంది వెంటనే నిర్దేశిత ప్రాంతాలకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. ఈ మాక్‌డ్రిల్‌లో భాగంగా క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించడం, మంటలను అదుపు చేయడం వంటివి ప్రదర్శించినట్లు చెప్పారు. ఫైరింజన్లు, అంబులెన్సులు వేగంగా సంఘటనా స్థలాలకు చేరుకునేందుకు ట్రాఫిక్ పోలీసులు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేయగా, వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అందించి, తీవ్రంగా గాయపడిన వారిని స్ట్రెచర్లపై ఆసుపత్రులకు తరలించే డ్రిల్ చేపట్టారని తెలిపారు. "ఇలాంటి విపత్కర ఘటనలు సంభవించినప్పుడు ప్రభుత్వ యంత్రాంగం ఎంత సమర్థవంతంగా, సమన్వయంతో పనిచేస్తుందో అంచనా వేయడమే ఈ మాక్‌డ్రిల్ ఉద్దేశం. కొన్ని లోపాలను కూడా గుర్తించాం. త్వరలోనే అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, వాటిని అధిగమించేందుకు కృషి చేస్తాం. భవిష్యత్తులో ఎదురయ్యే ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా సమర్థంగా ఎదుర్కొనేందుకు అవసరమైన అన్ని మెరుగైన చర్యలు తీసుకుంటాం" అని సీపీ ఆనంద్ తెలిపారు. ప్రజలు ఎలాంటి తప్పుడు వార్తలను నమ్మవద్దని, ఏదైనా సహాయం అవసరమైతే డయల్ 112కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు. ఇది కేవలం ప్రజల అప్రమత్తత కోసమే చేపట్టిన సన్నాహక చర్య అని ఆయన పునరుద్ఘాటించారు.

## మన జలాలను దేశం దాటనివ్వం

నదీ జలాల ఒప్పందాన్ని నిలిపేస్తున్నామని ఇటీవల కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో ప్రధాని వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తమ ప్రభుత్వం నదుల అనుసంధానంపై దృష్టి పెట్టిందని, రాష్ట్రాల మధ్య వివాదాలకు జలమే కారణమవుతోందని మంగళవారం ఏబీపీ నెట్‌వర్క్ నిర్వహించిన 'ఇండియా ఎట్ 2047' సదస్సులో మోదీ అభిప్రాయపడ్డారు. 'ఇంతకుముందు భారత్‌కు హక్కున్న జలాలూ దేశం బయటకు వెళ్లేవి. ఇక నుంచి భారత్ జలాలను భారత్‌లోనే వినియోగించుకుంటాం' అని పేర్కొన్నారు.

## 'ఆపరేషన్ సిందూర్' బ్రీఫింగ్.. ఎవరీ సోఫియా, వ్యోమికా..?

కోర్‌కు చెందిన సీజన్డ్ ఆఫీసర్. మూడు దశాబ్దాల ప్రయాణంలో ఆమె రాజీలేని వైఖరి ప్రదర్శించారు. తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్ ఆమె పనితీరును ప్రశంసించారు కూడా.

**వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్..** చిన్నప్పుడే పైలట్ కావాలని కలలు కన్నారు వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్. చదువుకునే రోజుల్లో ఎన్‌సీసీలో చేరారు. ఇంజినీరింగ్ విద్యను పూర్తిచేసిన ఆమె.. తన కలకు తగ్గట్టుగా భారత వైమానిక దళంలోని హెలికాప్టర్ పైలట్‌గా వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. డిసెంబర్ 18, 2019న ఫ్లయింగ్ బ్రాంచ్‌లో శాశ్వత కమిషన్ హోదా పొందారు. తన కుటుంబం నుంచి భారత భద్రతా బలగాల్లో చేరిన తొలి వ్యక్తి ఆమే కావడం విశేషం. జమ్మూకశ్మీర్, ఈశాన్య భారతంలోని ఎత్తైన ప్రాంతాలతో పాటు అత్యంత సవాలుతో కూడిన ప్రాంతాల్లో చేతక్, చీతా హెలికాప్టర్లను నడిపారు. పలు రెస్క్యూ ఆపరేషన్లలో పాలుపంచుకొన్నారు. ఈ రోజు జరిగిన మిలిటరీ బ్రీఫింగ్‌లో కేంద్రం అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్లు కనిపిస్తోంది. దాడి ఎంతా పక్కాగా చేసిందో.. ఈ బ్రీఫింగ్ విషయంలోనూ అంతే పక్కాగా వ్యవహరించింది. ఇందులో పాల్గొన్న భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి.. కశ్మీరీ పండిట్. ఈ ఆపరేషన్‌ను వ్యూహాత్మక విజయంగా చూడటమే కాకుండా కలిసికట్టుగా చేసిన కృషిగా కేంద్రం చూపాలనుకున్నట్లు వెల్లడవుతోంది. మహిళలు నాయకత్వం వహిస్తారు.. ప్రతీకారం తీర్చుకుంటారని వెల్లడి చేయాలనుకుందని తెలుస్తోంది. పలువురు పర్యాటకులను వారి భార్యల ముందు చంపినదానికి కౌంటర్‌గా ఈ ఇద్దరు మహిళలను ముందు వరుసలో నిలబెట్టారని పలువురు అభివర్ణిస్తున్నారు.

## ఉద్రిక్తతలను పెంచే ఉద్దేశం భారత్‌కు లేదు..

పరిస్థితులను తీవ్రతరం చేసేలా పాక్ వ్యవహరిస్తే.. భారత్ నుంచి ప్రతిస్పందన మరింత గట్టిగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఉద్రిక్తతలను పెంచే ఉద్దేశం మాత్రం తమకు లేదని వెల్లడించారు. ఇదే విషయాన్ని అమెరికా, బ్రిటన్, సౌదీ అరేబియా, జపాన్, రష్యా, ఫ్రాన్స్ దేశాల భద్రతా సలహాదారులు, కార్యదర్శులకూ డోభాల్ వివరించారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌పై తీసుకున్న చర్యలు.. ఆపరేషన్ నిర్వహించడానికి గల కారణాలను ఆయన ప్రపంచ దేశాలకు వివరించినట్లు అధికారులు తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా అక్కడి ఉగ్రవాదుల శిబిరాలపై దాడుల అమలు వివరాలు వారికి చెప్పినట్లు సమాచారం. భారత మిత్రదేశాలతో భవిష్యత్తులోనూ సమాచారం పంచుకుంటామని అన్నారు. ఇప్పటి వరకు ఆయన 8 దేశాల ప్రతినిధులతోనూ చర్చలు జరిపారు.

'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం విరుచుకుపడింది. పాక్‌లోని 4, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 5 స్థావరాలపై దాడులు చేసింది. అంతర్జాతీయ సరిహద్దుకు 30 కి.మీ. దూరంలో ఉన్న లష్కరే తోయిబాకు చెందిన గుల్పూర్ టెర్రర్ క్యాంప్ సహా 9 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని.. భద్రతా బలగాలు క్షిపణులు ప్రయోగించాయి. రాజౌరి – పూంచ్ ప్రాంతాల్లో ఇందులోని ఉగ్రవాదులు యాక్టివ్‌గా ఉన్నారు. ఇక్కడే 2023, 2024లో పూంచ్ దాడుల్లో కీలకంగా వ్యవహరించిన ఉగ్రవాదులు ట్రైనింగ్ పొందినట్లు తమకు సమాచారం ఉన్నట్లు భారత అధికారులు పేర్కొన్నారు. ఇప్పటివరకు అక్కడ 80 మంది వరకు ఉగ్రవాదులు మృతి చెందినట్లు వార్తలొస్తున్నాయి. బవహల్పూర్(జైషే మహమ్మద్), మురిద్కే (లష్కరే తొయిబా) క్యాంపుల్లోనే అత్యధిక మంది ఉగ్రవాదులు చనిపోయినట్లు తెలుస్తోంది.

## ఢిల్లీలో అమిత్ షా అత్యవసర సమీక్ష... నేడు అఖిలపక్ష సమావేశం

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 7)

ఆపరేషన్ సిందూర్ తో పాకిస్థాన్ పై దెబ్బకు దెబ్బతీసిన భారత్ తదుపరి చర్యలపై దృష్టి సారించింది. ఈ క్రమంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా దేశ రాజధాని ఢిల్లీలో అత్యవసర సమీక్ష చేపట్టారు. పాక్, నేపాల్ సరిహద్దు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, సీఎస్ లు, డీజీపీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం అయ్యారు. ఈ సమీక్ష సమావేశానికి జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్, సిక్కిం సీఎంలు హాజరయ్యారు. లఢఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ కూడా ఈ సమీక్షలో పాల్గొన్నారు.

**నేడు ఉదయం 11 గంటలకు అఖిలపక్ష భేటీ :** ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రేపు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. దేశ రాజధాని ఢిల్లీలో మే 8వ తేదీ ఉదయం 11 గంటలకు ఈ సమావేశం జరగనుంది. ఆపరేషన్ సిందూర్ వివరాలను కేంద్రం ఈ అఖిలపక్ష సమావేశంలో పంచుకోనుంది.

## రైతులు ఈ కేవైసీ చేయించుకోవాలి



(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, మే 7)

మండలంలోని రైతు సోదరులనుదేశించి మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులందరూ అన్నదాత సుఖీభవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా దగ్గర్లో ఉన్న రైతు సేవ కేంద్రం దగ్గర వెళ్లి తమ పేరు ఉందో లేదో చూసుకుని ఈకేవైసీ చేయించుకున్న కోరారు. అదేవిధంగా ప్రభుత్వం అన్నదాత సుఖీభవదారా రైతులకి రూ.20,000 రూపాయి లు తమ అకౌంట్లో పడతాయని వివరించారు. మొదట విడత రూ.7000 జూన్ లో వేస్తారు. రెండో విడత రూ.7000 సెప్టెంబర్ లో వేస్తారు. మూడో విడతగా రూ.6000 డిసెంబర్లో రైతు ఖాతాలో వేస్తారన్నారు.

## గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు







(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 7)

ఉలవపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం విద్యార్థులతో ముందుగా నీతి కథలు చదివించారు. అనంతరం పిల్లల మానసిక ఆనందం కోసం ఖోఖో పోటీలు నిర్వహించారు. ప్రతి రోజా ఎక్కువ మంది పిల్లలను గ్రంథాలయానికి పంపిస్తున్న వారి తల్లిదండ్రులకు గ్రంధపాలకుడు డి .కోటేశ్వరరావు కృతజ్ఞలు తెలిపారు. చివరిగా పిల్లలకు స్నాక్స్ పంచిపెట్టారు.

## పొగాకు రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా చర్యలు

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 7)

పొగాకు రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా కూటమి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ హామీ ఇచ్చారు. ఒంగోలు నియోజకవర్గం త్రోవగుంట వద్ద ఉన్న పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే దామచర్ల.. పొగాకు కొనుగోలు చేసే సంస్థలు కూడా సరైన ధరకు పొగాకును కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు, రైతు సంఘాల నేతలు, పొగాకు కొనుగోలు సంస్థల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి.. రైతులకు అన్యాయం జరగకుండా గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకుంటామని దామచర్ల హామీ ఇచ్చారు.

## భూసార పరీక్షలతో రైతులకు మేలు – డీడీఏ శివకుమారి



(షణ్ముఖ వెలుగు, నూజండ్ల, మే 7)

భూసార పరీక్షల కొరకు నిర్దేశించిన లక్ష్యం మేరకు మట్టి నమూనాలను సేకరించి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా వనరుల కేంద్రం (డీఆర్సీ), డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (డీడీఏ) ఎం శివకుమారి అన్నారు. మండలంలోని ఉప్పలపాడు, తలర్లపల్లి రైతు సేవా కేంద్రాల పరిధిలో సిబ్బంది చేపడుతున్న మట్టి నమూనాల సేకరణ కార్యక్రమంను బుధవారం డీడీఏ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖరీఫ్ సీజన్ 2025–26 సంవత్సరానికి మట్టి నమూనాల సేకరణతో పాటు రైతు వివరాలు, పంటల సాగు వివరాలు ఏప్పటికప్పుడు సాయిల్ హెల్త్ కార్డ్ యాప్‌లో ఆన్లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన మట్టి నమూనా సేకరణ కార్యక్రమంను రైతులు సోదరులు అందరూ సద్వినియోగపరచుకోవాలని కోరారు. సేకరించిన నమూనాలలో ప్రయోగశాలో పరీక్ష అనంతరం ఉదజని సూచిక, లవణ పరిమాణం, సేంద్రీయ కర్బనం, లభ్య నత్రజని, భాస్వరం, పొటాషియం, సూక్ష్మ పోషకాలు స్థాయి ఎలా ఉన్నదో నిర్ధారిస్తూ ఉన్న సమాచారంతో కూడిన నేల ఆరోగ్య పత్రం (సాయిల్ హెల్త్ కార్డు)ను రైతులకు అందజేయునట్లు తెలిపారు. సమస్యాత్మక నేలలకు భూసార పరీక్ష ఫలితముల ఆధారంగా రైతులకు రాయితీపై సూక్ష్మ పోషకాలను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ క్షేత్ర సందర్శనలో ఏఈవో ఎలీషా, బి అప్పారావు, విహెచ్ఏ తేజస్వి, తదితరులు పాల్గొన్నారు.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
3 | 08.05.24 గురువారం



## ప్రజలు భయభ్రాంతులకు గురికాకుండా చర్యలు చేపట్టండి

**వీడియా కాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబు సూచన**

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 7)

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో ప్రజలు భయభ్రాంతులకు గురికాకుండా, అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. (తరువాయి 4లో...)

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# ప్రకాశం జిల్లా పాలనలో గందరగోళం



**అధికారంలో టీడీపీ..పెత్తనం మాత్రం వైసీపీదే**

**టీడీపీకే అధికారబలం..వైసీపీకి వ్యవస్థ పై ఆధిపత్యం**

**తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్న తెలుగు తమ్ముళ్లు**



(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, మే 7)

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటికీ జిల్లా స్థాయిలో పరిపాలనా వ్యవస్థపై మాత్రం ఇంకా వైసీపీ నేతలదే పెత్తనం కొనసాగుతుండటం గమనార్హం. కొండేపి, ఒంగోలు, సంతనూతలపాడు, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాల్లో టీడీపీ గెలిచినప్పటికీ స్థానికంగా అధికార లాభాలు మాత్రం టీడీపీ కార్యకర్తలకూ, నేతలకూ దక్కట్లేదనే తీవ్ర అసంతృప్తి నెలకొంది. అధికారం కూటమి చేతికి వచ్చింది. అధికారులు పోస్టింగులు సాధించే వరకు ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఇక పోస్టింగ్ సాధించిన తర్వాత ఎమ్మెల్యేలకు కూడా చుక్కలు చూపిస్తున్నారని చెప్పడంలో ఏ మాత్రం సందేహం లేదు. ఏ అధికారి కూడా ఎమ్మెల్యేల మాటలను పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఓ వైపు ఎమ్మెల్యేలు, కలెక్టర్ సైతం అధికారులకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూనే ఉన్నారు. ప్రజలను సమస్యలపై తమ కార్యాలయాలకు ఒకటికి పది సార్లు తిప్పుకోవద్దు అని అయినా వారి మాటలను స్థానిక అధికారులు పెడచెవిన పెడుతున్నారు. పశ్చిమ ప్రాంతంలో ఈ తంతు బాగా సాగుతోంది. అధికారులు ఎమ్మెల్యేలు, టీడీపీ నేతల మాటలు వినే పరిస్థితులో లేరు. కానీ వైసీపీ నేతలు మాత్రం ఏదైనా పని అడిగితే మాత్రం నిమిషాల్లో కానిచ్చేస్తున్నారు. ఇదీ ప్రకాశం జిల్లాలో అధికారుల పనితీరు....చాలా మంది అధికారులు ఈ బాటలోనే కొనసాగుతున్నారు. కొన్ని చోట్ల ఎమ్మెల్యేలు కూడా వైసీపీ నేతలకు గ్రీన్ సిగ్నల్స్ ఇచ్చారనే ప్రచారం సాగుతోంది. మరి ఎమ్మెల్యేలు వైసీపీ నేతలకు గ్రీన్ సిగ్నల్స్ ఇచ్చారో లేదో సదరు ఎమ్మెల్యేలే చెప్పాలి మరి.. టీడీపీ కార్యకర్తలు మాత్రం గతంలో మాదిరిగా తమ పార్టీ లేదని వాపోతున్నారు...

**కూటమి గెలిచిందని ఆనందం**

కూటమి గెలిచిందని ఆనందం ఉన్నప్పటికీ పనులు మాత్రం చేతికి రాలేదన్న నిరాశలో తెలుగు తమ్ముళ్లు ఉన్నారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వంలో టీడీపీకి పెద్దపీట పడటంతో కార్యకర్తలు, ద్వితీయశ్రేణి నాయకులు తమ సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయని ఆశించారు. కానీ అది కలగానే మిగిలింది. పనుల కోసం ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నా ఫలితం మాత్రం గోచరిస్తున్నట్లే లేదు. కొన్ని నియోజకవర్గాల్లో అధికారంలో ఉన్న టీడీపీ ఎమ్మెల్యేలు సైతం వైసీపీకి చెందిన నాయకుల పనులకే ప్రాధాన్యం ఇస్తుండటం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది.

**చెల్లించే వారికే చక్కగా పనులు**

మేము ఎమ్మెల్యే అడిగిన మేరకు మామూళ్లు చెల్లిస్తున్నాం. అందుకే మాకు పనులు నిర్బంధం లేకుండా జరుగుతున్నాయి అని కొందరు వైసీపీ నాయకులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఇదే విషయాన్ని టీడీపీ శ్రేణులు ఆవేదనగా చూపిస్తున్నాయి. మేము ఐదేళ్లు పార్టీకి సేవ చేశాం. ఎన్నో పోరాటాలు చేశాం. అయినా మాకు మాత్రం పనులు కావడం లేదని వాపోతున్నారు.

**యర్రగొండపాలెం, దర్శిలోనూ ఇదే పరిస్థితి**

యర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గాల్లో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థులు ఓడిపోయారు. ఈ రెండు నియోజకవర్గాల్లో వైసీపీ గెలిచినా నియోజకవర్గంలో టీడీపీ నేతలే పెత్తనం చేస్తున్నారు. అయినా వైసీపీ నేతలకే పనులు జరగడాన్ని చూస్తే స్థానిక అధికార వ్యవస్థ పై ఎవరి పట్టుంది అన్న ప్రశ్న ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా యర్రగొండపాలెం నియోజకవర్గంలో టిడిపి నియోజకవర్గ ఇంచార్జి ఏకంగా టిడిపిలోని ఒక సామాజిక వర్గాన్ని పక్కన పెట్టేశారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వైసీపీకీ చెందిన మరో సామాజిక వర్గానికి అంటకాగుతూ వారి పనులను చకచకా చేస్తున్నారనే విమర్శలు టీడీపీ లోని కొందరు కార్యకర్తలు బాహాటంగా చేస్తున్నారు. ఈ విషయంలో ఆ పార్టీకి చెందిన మరొక సామాజిక వర్గం నేరుగా అధిష్టాన వర్గానికి ఫిర్యాదు చేయడం గమనార్హం.

**తెలుగు తమ్ముళ్ల వేదన**

మేము పార్టీ కోసం రక్తం కార్చాం. జెండాలు మోశాం. ఓటర్ల ఇంటికెళ్లాం. అయినా అధికారంలోకి వచ్చిన తర్వాత మాకు అన్యాయం జరగడం బాధాకరం అంటూ కార్యకర్తలు హృదయాన్ని కలిచేలా వాపోతున్నారు. ఈ పరిస్థితి మార్చకపోతే వచ్చే ఎన్నికల్లో పార్టీకి తీవ్ర నష్టం తప్పదని చాలా మంది చెబుతున్నారు. ఇన్ని కష్ట నష్టాలు ఓర్చుకొని పార్టీని అధికారంలోకి తీసుకొస్తే తమను పక్కన పెట్టి వైసీపీ నాయకులకు పనులు చేయడంలో గల ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఇది జీర్ణించుకోలేక చాలా మంది టిడిపి నాయకులు, కార్యకర్తలు కన్న తల్లిలాంటి టిడిపికే దూరంగా ఉండాల్సి వచ్చిందని మదన పడుతున్నారు.

**ఇప్పటికైనా అధిష్టానం మేల్కొనాలి**

అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొదట ప్రాధాన్యత టిడిపి కార్యకర్తలదే అన్నారు. కార్యకర్తలు లేకుంటే పార్టీనే లేదన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా చూసుకోవాలని హితవు పలికారు. ఎమ్మెల్యేలు, ఇంచార్జిలు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలని పేర్కొన్నారు. అయినప్పటికీ జిల్లాలో అధికార పార్టీ ఎమ్మెల్యేల, ఇంచార్జిల తీరు మారలేదు. వక్రబుద్ధి పోనించుకోలేదు. నిత్యం సంచులు సర్దుకుంటూ వైసీపీ నాయకులకు పనులు చేస్తున్నారనే ఆరోపణలు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు చేయడం గమనార్హం. ఇదే పరిస్థితి కొనసాగి మామూళ్లకు మాత్రమే పనిచేస్తే పార్టీ బలాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని టిడిపి నాయకులు, కార్యకర్తలు హెచ్చరిస్తున్నారు. ఈ విషయంలో టీడీపీ అధిష్టానం ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే...!

## ఎలాంటి విపత్కర పరిస్థితినైనా
# భద్రతాపరంగా సమర్ధంగా ఎదుర్కొనేలా సన్నద్ధం

**జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్**

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 7)





సంఘ విద్రోహ చర్యలను నిర్వీర్యం చేయుట, సమాజంలో శాంతి భద్రతలు పరిరక్షణ, పౌరులకు భద్రతా భావాన్ని కల్పించే చర్యల్లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ పర్యవేక్షణలో బుధవారం ఒంగోలు రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ మరియు జిల్లా పలు ప్రదేశాలలో అగ్ని పేలుడు, ప్రమాదకరమైన పరిస్థితులు ఏర్పడినప్పుడు, ఎక్సప్లోజిప్స్ అనుమానాస్పదమైన బ్యాగు ఉంచి ఆ ప్రదేశంలో దాన్ని గుర్తించి చేపట్టాల్సిన భద్రతా చర్యలు, సైరన్లు మోగినప్పుడు తక్షణమే ఏమి చేయాలి రక్షణ కోసం ఎలాంటి చర్యలు చేపట్టాలనే విషయాలపై స్పెషల్ పార్టీ పోలీసులు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ఫైర్, హెల్త్ సిబ్బంది వెంటనే చేపట్టే చర్యలు సివిల్ మాక్ డ్రిల్ నిర్వహించారు. అలాంటి పరిస్థితుల్లో ప్రజలు భద్రతా పరంగా తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆ ప్రదేశానికి ఎవరిని వెళ్లకుండా పౌరులు బాధ్యతగా (తరువాయి 4లో...)

## శ్రీ హరిహర క్షేత్రం వైభవంగా వాసవి అమ్మవారి జయంతి ఉత్సవాలు

**విశేష పూజలు నిర్వహించిన మాజీ మంత్రి శిద్దా రాఘవరావు లక్ష్మి పద్మావతి, శిద్దా పాండురంగారావు, శిద్దా సుధాకర్ దంపతులు**

**కలశాలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించిన వాసవి మహిళలు**





(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, మే 7)

చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ పార్వతీ సమేత నగరేశ్వర స్వామి ఆలయం నుండి 102 కలశాలతో శిద్దా లక్ష్మి పద్మావతి ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహిళలు ఊరేగింపుతో శ్రీ హరిహర క్షేత్రంలో వేంచేసి ఉన్న శ్రీ వాసవి అమ్మవారికి సామూహిక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు హరి వెంకట కుమారా చార్యులు, సుబ్రమణ్య శర్మ, హరికృష్ణ శర్మ, కృష్ణ శర్మ ఆధ్వర్యంలో శ్రీ వాసవి అమ్మవారికి పంచామృత, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, అలంకరణ నిర్వహించారు. చీమకుర్తి ఆర్యవైశ్య మహిళలచే సామూహిక శ్రీ లలితా సహస్రనామ పారాయణం, శ్రీ హనుమాన్ చాలిశా, సంకీర్తనలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా శిద్దా లక్ష్మి పద్మావతి వాసవి మహిళలతో కలసి (తరువాయి 4లో...)

## కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా
# ప్రభుత్వ విద్యా సంస్థల్లో పరీక్షా ఫలితాలు రావాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యం

పేద విద్యార్థుల పట్ల సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ ప్రత్యేక శ్రద్ధ



వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు నాణ్యమైన బియ్యంతో భోజనం

విద్యార్థులకు కూటమి ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది

వచ్చే ఏడాది గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో 100% ఉత్తీర్ణత సాధించాలి

మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

4



# కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా
# ప్రభుత్వ విద్యా సంస్థల్లో పరీక్షా ఫలితాలు రావాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యం

(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 7)





కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఫలితాలు రావాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. బుధవారం నాడు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన సాంఘిక సంక్షేమ, గిరిజన గురుకులాలు మరియు వసతి గృహాల విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించే కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, గిరిజన సంక్షేమం, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిలు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 315 మంది పదవ తరగతి, ఇంటర్మీడియెట్ లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మెమొంటో, సర్టిఫికెట్స్ అందించారు. ఇందులో 34 మంది మెరిట్ విద్యార్థులకు మొదటి ప్రైజ్ రూ.20 వేలు, రెండో ప్రైజ్ రూ. 15 వేలు, మూడో ప్రైజ్ రూ.10,000 నగదు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన సాంఘిక సంక్షేమ, గిరిజన గురుకులాలు, వసతి గృహాల విద్యార్థులకు ప్రశంసా పత్రాలు నగదు ప్రోత్సాహకాలు అందించటం ఇదే తొలిసారన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఫలితాలు రావలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యం అన్నారు. పేద విద్యార్థుల పట్ల ముఖ్యమంత్రి, మరియు మానవవనరుల శాఖా మంత్రి నారా లోకేశ్ లు పత్యేక శ్రద్ధ తీసుకుని విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మరమ్మతులు, మౌలిక ఏర్పాట్లకు రూ.143 కోట్లు ఖర్చుచేసామన్నారు. నీట్ ఉచిత కోచింగ్ సెంటర్లను ఈ ఏడాది నుంచి 10కి పెంచుతున్నామన్నారు. తద్వారా ఎక్కువ మంది ఐఐటీ, నీట్ తదితర విద్యా సంస్థల్లో ఎక్కువ సీట్లు దక్కే అవకాశం ఉందన్నారు. ప్రతిభ ఎవరి సొంతం కాదని, సాంఘిక సంక్షేమ, గిరిజన గురుకులాలు, వసతి గృహాల విద్యార్థుల వల్ల ఆయా సంస్థలకు మంచి పేరు వచ్చిందన్నారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో 94 శాతం ఉత్తీర్ణత సాధించడం విద్యార్థుల, అధ్యాపకులు కృషికి నిదర్శనమన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు కాస్మోటిక్ కిట్స్, నాణ్యమైన బియ్యంతో భోజనం అందిస్తామన్నారు. గురుకులాల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక వైద్యుల్ని నియమించామన్నారు. సంరక్షకులు లేని విద్యార్థులకు వేసవి సెలవుల్లోనూ హాస్టళ్లలో వసతి కల్పిస్తున్నామన్నారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపట్ల టీచర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వచ్చే ఏడాది గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా అధ్యాపకులు కృషి చేయాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం ఎం నాయక్, ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ కార్యదర్శి వి ప్రసన్న వెంకటేష్, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లావణ్య వేణి, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి జి గౌతమి, సంచాలకులు ఎస్ భార్గవి, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు, వార్డెన్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఎలాంటి విపత్కర పరిస్థితినైనా
# భద్రతాపరంగా సమర్ధంగా ఎదుర్కొనేలా సన్నద్ధం













వ్యవహరించటం గురించి, పోలీసులు చేసే విధివిధానాలు గురించి క్షుణ్ణంగా ప్రజలకు అర్ధమయ్యే విధంగా వివరించారు. రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌లో అనుమానాస్పదంగా బ్యాగు ఉన్నట్లు వచ్చిన సమాచారంపై వెంటనే పోలీసులు బీడీ టీం, స్పెషల్ పార్టీ సిబ్బంది, డాగ్స్ స్క్వాడ్ తో సంఘటన ప్రదేశానికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. స్పెషల్ పార్టీ, బీటీ టీం సిబ్బంది రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ చుట్టుపక్కల క్షుణ్ణంగా పరిశీలించి అనుమానస్పద బ్యాగ్‌ను గుర్తించారు. ఆ బ్యాగులో పేలుడు పదార్థాలు ఉన్నట్లుగా స్నాపర్ డాగ్ గుర్తించింది. ప్రజలు ఆ ప్రదేశానికి ఎవరిని వెళ్లకుండా క్యూ మేనేజర్ ఏర్పాటు చేసినారు. పోలీసు సిబ్బంది బాంబు డిస్పోజల్ సూట్ ధరించి ఆ ఎక్స్‌ప్లోజివ్ నిర్వీర్యం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కీలకమైన కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఉన్న 244 జిల్లాలను భద్రతాపరంగా ప్రత్యేకంగా గుర్తించి మాక్ డ్రిల్స్ నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ క్రమంలో మన రాష్ట్రంలో విశాఖపట్నం జిల్లాను ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. అయితే కీలక ప్రభుత్వ సంస్థలు ఉన్న అన్ని ప్రదేశాలలోనూ మాక్ డ్రిల్స్ నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదేశించినందున ఒంగోలు రైల్వే స్టేషన్, బస్సు స్టేషన్‌లలో ఈ మాక్ డ్రిల్స్ నిర్వహించినట్లు చెప్పారు. నిజంగా ఉపద్రవం సంభవిస్తే ఎలా ఎదుర్కోవాలి ? వివిధ శాఖల సన్నద్ధత, సమన్వయలోపాలను తెలుసుకోవడం, ఇలాంటి సమయాలలో ఎలా వ్యవహరించాలో ప్రజలకు తెలియజేసేందుకే ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఎలాంటి పరిస్థితినైనా సమర్ధంగా ఎదుర్కొంటామని, జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సింధూర్ ఆపరేషన్ నేపథ్యంలో ఎక్స్‌ప్లోజివ్స్ అనుమానాస్పదమైన బ్యాగు, ఉగ్రవాదులు దాడులు చేపడితే ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టాలనే దానిపై మాక్ డ్రిల్ నిర్వహించమని, ఏదైనా ప్రదేశంలో సంఘ విద్రోహశక్తులు దాడులు చేస్తే అన్ని శాఖలు సంయుక్తంగా విధులు నిర్వహించి ప్రాణ నష్టం, ఆస్థి నష్టం లేకుండా తీసుకోవలసిన చర్యలు, విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రజలు ఏవిధంగా అప్రమత్తంగా వ్యవహరించాలనే విషయాల గురించి పౌరులకు అవగాహన కల్పించమన్నారు. రైల్వే స్టేషన్, బస్సు స్టాండ్ లతో పాటు టంగుటూరు పరిసర ప్రాంతాలలో పెట్రోలియం సంస్థలు, కేంద్ర,రాష్ట్ర ఆస్తులు కూడా ఉన్నందున వాటి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావద్దన్నారు. ప్రాణ నష్టం జరుగకుండా ప్రజలలో అవగాహన కల్పించేందుకే ఇలాంటి మాక్ డ్రిల్ నిర్వహించామన్నారు. ఈ డెమో డ్రిల్ ద్వారా భవిష్యత్తులో సంభవించే అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఏమైనా అనుమానస్పదంగా బ్యాగులు, వ్యక్తులు మరియు ఇతర వస్తువులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112 సమాచారం అందించాలని పోలీస్ అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె నాగేశ్వరరావు, ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ రాఘవేంద్ర, ఒంగోలు వన్‌టౌన్ సీఐ నాగరాజు, ఒంగోలు టు టౌన్ సీఐ శ్రీనివాసరావు, సింగరాయకొండ సీఐ హాజరత్తయ్య, ఆర్‌ఐలు రమణరెడ్డి, సీతారామిరెడ్డి, ఏఆర్ ఎస్ఐలు, ఇతర శాఖల అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.











# శ్రీ హరిహర క్షేత్రం వైభవంగా వాసవి అమ్మవారి జయంతి ఉత్సవాలు
















క్షేత్రంలో వేంచేసి ఉన్న సకల దేవతలకు ప్రత్యేక పూజలు, బాల, కుమారి, సువాసిని పూజలు నిర్వహించి వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి విశేష పూజలు, నైవేద్యం సమర్పించి అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. చీమకుర్తి కి చెందిన ఆర్యవైశ్య మహిళల ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కుంకుమ పూజ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సాయంత్రం వాసవి మహిళా భక్తులు, చీమకుర్తి ఆర్యవైశ్య యూత్ ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి నగరోత్సవం కన్నులపండువగా సాగింది శ్రీ హరిహర క్షేత్రం నుండి సాగిన అమ్మవారి నగరోత్సవం చీమకుర్తి పుర వీధుల్లో జరిగింది. అమ్మవారి నగరోత్సవంలో మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శిద్దా వెంకటేశ్వర్లు, శిద్దా పాండురంగారావు దంపతులు, శిద్దా సురేష్ దంపతులు, వారి కుటుంబ సభ్యులు, శిద్దా పెద్దబాబు దంపతులు, శిద్దా సాయిబాబు, శిద్దా బాలాజీ దంపతులు, శిద్దా వెంకట ప్రసాద్ దంపతులు, నూనె సుబ్రహ్మణ్యం, చలువాది బదరి నారాయణ, కూరపాటి సుబ్బారావు దంపతులు, పల్లపోతు పద్మ, ఆర్యవైశ్య మహిళ అధ్యక్షురాలు సువర్ణ, ఏ అరుణ, వాసవి యూత్ సభ్యులు పాల్గొన్నారు. శిద్దా వెంకటేశ్వర్లు, శిద్దా వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు వాహన సౌకర్యం, అన్న సంతర్పణ అందచేశారు.

# ప్రజలు భయభ్రాంతులకు గురికాకుండా చర్యలు చేపట్టండి



ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఆర్మీ అధికారులు, డిజాస్టర్ మేనేజ్మెంట్ అధికారులతో వర్చువల్‌గా సమావేశమై తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో ఏ క్షణంలోనైనా శత్రువుల దాడి జరిగే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం నుండి హెచ్చరికలు వచ్చిన నేపథ్యంలో ప్రజలకు స్పష్టమైన సూచనలు, ఆదేశాలు ఇస్తూ, ప్రజలు భయభ్రాంతులకు గురి కాకుండా, అప్రమత్తంగా ఉండేలా యంత్రాంగం చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. విపత్తు పరిస్థితులు ఏర్పడినప్పుడు ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశాలపై ముఖ్యమంత్రి, జిల్లాల కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ఒంగోలు కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలక్రిష్ణ పాల్గొన్నారు.

# పిఎం సూర్యఘర్ పథకం సద్వినియోగం చేసుకోవాలి

## ఆర్థిక స్వాలంబనతో పాటు పర్యావరణానికి మేలు

## దర్శి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి శ్రీనివాసులు








**(షణ్ముఖ వెలుగు, దర్శి ఇన్‌ఛార్జి, మే 7)**

ప్రతి ఇంట ప్రధానమంత్రి సూర్యఘర్ ముస్త్ బిజిలీ యోజన పథకంతో ఆర్థిక స్వాలంబన వెలుగులు నిండాలని, పథకాన్ని సద్వినియోగం చేసుకుని భావితరాలకు ఆరోగ్యకర పర్యావరణాన్ని వారసత్వ సంపదగా అందిద్దామని గ్రామస్తులకు దర్శి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం తాళ్ళూరు మండలం తూర్పు గంగవరం గ్రామంలోని విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో గ్రామస్తులకు పీఎం సూర్యఘర్ పథకంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ పథకం కింద రూ.2 లక్షల విలువైన 3 కిలోవాట్ల సోలార్ ప్యానెల్‌ను రూ.78 వేల సబ్సిడీ రాయితీతో ఇంటి పైకప్పు పై ఏర్పాటు చేసుకోవచ్చున్నారు. 1 కిలోవాట్ కి రూ. 30 వేలు, 2 కిలోవాట్లకి రూ.60 వేలు, 3 కిలోవాట్లు ఆ పైన రూ.78 వేలు సబ్సిడీ రాయితీ వస్తుందన్నారు. ఈ పథకంలో తక్కువ వడ్డీతో బ్యాంకు రుణంగా పొందవచ్చున్నారు. ఐదారేళ్లలోనే పెట్టిన పెట్టుబడి తిరిగి వస్తుందని, 25 ఏళ్ల పాటు ఉచితంగా విద్యుత్ పొందవచ్చని తెలిపారు. మన ఇంటి అవసరాలకు సరిపోయాక, మిగిలిన సౌర విద్యుత్‌ను గ్రిడ్‌కు ఇవ్వడం ద్వారా తిరిగి ఆదాయం పొందవచ్చున్నారు. ఈ పథకం కింద దేశం మొత్తంలో మొదటి కోటి మందికి మాత్రమే సబ్సిడీ రాయితీ అందుబాటు అవుతుందని కావున మన వినియోగదారులు ముందగా పీఎం సూర్యఘర్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలసిందిగా సూచించారు. సొంత ఇల్లు, విద్యుత్ కనెక్షన్ ఉన్న వారెవరైనా పీఎం సూర్య ఘర్ వెబ్‌సైట్‌లో సులభంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చున్నారు. లేదా విద్యుత్ శాఖ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

50 శాతం రాయితీతో అదనపు లోడ్ పథకం


గృహ వినియోగదారులకు 50 శాతం రాయితీతో స్వచ్ఛంది అదనపు లోడ్ పథకంను సద్వినియోగం చేసుకోవాలి. 01-మార్చి-2025 నుండి 30-జూన్-2025 వరకు 50 శాతం రాయితీతో ఈ పథకం అమలులో ఉంటుంది. గృహ వినియోగదారులు పెరిగిన వినియోగానికి అనుగుణంగా ప్రస్తుతం కనెక్ట్ చేయబడినటువంటి లోడు ప్రకారం లోడును క్రమబద్ధీకరించుకోవాల్సి ఉంది. తగిన అవగాహన లేక వినియోగదారులు జరిమానాలు చెల్లించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో 50 శాతం రాయితీ పై స్వచ్ఛంద అదనపు లోడు క్రమబద్ధీకరణకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుందని దర్శి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పాలగిరి శ్రీనివాసులు అన్నారు. దర్శి డివిజన్ పరిధిలోని వినియోగదారులందరకు దశబ్దాల నాటి లోడును ప్రస్తుతం కనెక్ట్ చేయబడిన లోడ్ ప్రకారం 50 శాతం రాయితీతో అదనపు లోడును వినియోగదారులే స్వచ్ఛందంగా ముందుకొచ్చి డెవలప్‌మెంట్ చార్జిలో యాభై శాతం రాయితీ పొందవచ్చు, క్రమబద్ధీకరించుకొనవచ్చు అని తెలిపారు. ఈ స్వచ్ఛంద అదనపు లోడు క్రమబద్ధీకరణ కోసం ఈ నెల ఒకటో తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చునాని తెలియపరిచారు. దగ్గరలో ఉన్న ఎలక్ట్రికల్ రెవెన్యూ ఆఫీసు నందు సంప్రదించి తగు లోడును క్రమబద్ధీకరించుకొనవచ్చు.

రాయితీ వివరాలు ఇలా

| అదనపు లోడ్ (కిలో వాట్'లు) | అసలు రుసుము | యాభై శాతం రాయితీ పోనూ చెల్లించాల్సింది |
|---|---|---|
| 1 | 2,250 | 1,250 |
| 2 | 4,450 | 2,450 |
| 3 | 6,650 | 3,650 |
| 4 | 8,850 | 4,850 |
| 5 | 11,050 | 6,050 |

ఈ కార్యక్రమంలో జూనియర్ ఇంజనీర్ ఇమ్మానియేలు, ఎల్ఐ కాంతారావు, శ్రీనివాసరావు, ఎల్ఎం నారాయణ, వెంకటేశ్వర్లు, ఇతర సిబ్బంది, తూర్పు గంగవరం, నాగంబొట్లపాలెం ప్రజలు పాల్గొన్నారు.

### భయపడను.. తిరిగి చెల్లిస్తా
### మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 7)**

ప్రభుత్వం చేసే అన్యాయాలపై ప్రశ్నిస్తుంటే కేసులు పెడుతున్నారని తనపై కేసులు పెట్టిన ఏ ఒక్కరిని వదిలే ప్రసక్తే లేదని కావాలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి అన్నారు. ఆయన ఈ మేరకు బుధవారం కావలిలో పత్రికా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని అక్రమ గ్రావెల్ తవ్వకాలు, ఇసుక, రేషన్ బియ్యం యదేచ్చగా అక్రమాలు జరుగుతున్నాయని దానిపై ప్రశ్నిస్తే తనపై ప్రభుత్వం ఆస్తులు ధ్వంసం చేశారని కేసులు పెట్టడం ఏందని ఆయన ప్రశ్నించారు. తనపై ఎన్ని కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు. తాను నియోజకవర్గాన్ని విడిచి పారిపోతున్నారన్న కొంతమంది విమర్శలను ఆయన తిప్పి కొట్టారు.

## భారత సైన్యం అసమాన పోరాట పటిమకు ప్రతీక ఆపరేషన్ సింధూర్

### ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 7)**

భారత సైన్యం అసమాన పోరాట పటిమకు ప్రతీక ఆపరేషన్ సింధూర్ అని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కొనియాడారు. ఈ సైనిక చర్య ద్వారా త్రివిధ దళాలు ప్రదర్శించిన అసాధారణ ధైర్యసాహసాలు, సమర్థత, నిబద్ధతను హృదయపూర్వకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆపరేషన్, దేశ భద్రతను కాపాడేందుకు, శాశ్వతంగా ఉగ్రవాద పీడను వదిలించేందుకు చేపట్టిన అత్యంత కీలకమైన చర్యగా అభివర్ణించారాయన. బుధవారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ భారత సైనికుల అచంచలమైన దేశభక్తి, యుద్ధసన్నద్ధత గురించి మాటల్లో వర్ణించలేమన్నారు. ఇదే సమయంలో ఆపరేషన్ సింధూర్ ద్వారా, భారత సైన్యం శత్రువులకు గట్టి హెచ్చరిక జారీ చేసినట్లైందన్నారు. భారత దేశ సార్వభౌమత్వంపై ఎవరూ కన్నెత్తి చూడలేరని, ఎక్కడైనా దాక్కున్న ఉగ్రవాదులను వెలికితీసి నిర్మూలించే సామర్థ్యం మన సైన్యానికి ఉందని ఈ దాడితో రుజువు చేశారన్నారు. ఈ ఆపరేషన్ దేశ ప్రజలలో ధైర్యం నింపడమే కాక, అంతర్జాతీయ సమాజంలో భారతదేశ శక్తిని మరింత బలోపేతం చేసిందన్నారు. ఈ సందర్భంగానే త్రివిధ దళాధిపతులకు, రాజకీయ నాయకత్వానికి అభినందనలు తెలియజేశారు చీఫ్‌విప్ జీవీ. ఈ ఆపరేషన్ విజయవంతం కావడానికి దిశానిర్దేశం చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన దూరదృష్టి, స్థిరమైన నాయకత్వం, దేశ భద్రత పట్ల నిబద్ధత ఈ విజయానికి మూలాధారమన్నారు. ప్రధాన మంత్రి మోదీ నాయకత్వంలో, భారత్ శక్తివంతమైన శక్తిగా ఎదుగుతోందని ఆపరేషన్ సిందూర్ మరోసారి నిరూపించిందన్నారు.



## మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే కదిరి

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 7)**

తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం వైసీపీ రీజినల్ కోఆర్డినేటర్లు,పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కనిగిరి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు హాజరయ్యారు. ఈ సందర్భంగా తనను విశాఖపట్నం పార్లమెంటు పరిశీలకులుగా నియమించినందుకు జగన్మోహన్‌రెడ్డిని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపి బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యల పై జగన్మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేసినట్లు కదిరి బాబురావు తెలిపారు.

# కుట్టుమిషన్ల శిక్షణ ద్వారా మహిళా ఆర్థిక ప్రగతికి బాటలు

### వినుకొండలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభించిన ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు







**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 7)**

కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కుట్టుమిషన్ల శిక్షణ ద్వారా మహిళా ఆర్థికప్రగతికి బాటలు పడతాయని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. అదే లక్ష్యంతో రూ.255 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా లక్షలమందికి మేలు జరగబోతుందన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 46వేలమందికి, ఆర్థికంగా వెనకబడిన ఇతర కులాల వారిలో 56వేల 700మందికి ప్రభుత్వం కుట్టుమిషన్ల శిక్షణ ప్రారంభిస్తోందని తెలిపారు. ఇందుకోసం రూ.255కోట్లు నిధులు కేటాయించిందన్నారు. వినుకొండలోని గుర్రం జాషువా కళా ప్రాంగణంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని బుధవారం చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ లాంఛనంగా ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ వారి సహకారంతో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన మహిళలు ఇంటివద్దనే ఉపాధి, ఆదాయం పొందేలా ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందడానికి సువర్ణావకాశమని అభిప్రాయ పడ్డారు. వినుకొండలో బీసీ కార్పొరేషన్ ద్వారా 285మందికి మొదటి విడతలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 45 నుంచి 90 రోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ పొందిన వారందరికీ ప్రభుత్వఖర్చుతోనే కుట్టుమిషన్లు కొనిస్తామని తెలిపారు. తద్వారా మహిళలు ఇంటివద్ద నుంచే నెలకు రూ.5వేల నుంచి రూ.15 వేల వరకు ఆదాయంతో కుటుంబ పోషణలో పాలుపంచుకునే అవకాశం లభిస్తుందనిస పిల్లల్ని మంచి చదువులు చదివించుకోగలుగుతారని తెలిపారు. శిక్షణ పొందినవారు ఆధునిక మోడళ్లను చేయగలిగితే స్థానికంగా మంచి మార్కెట్ కూడా ఏర్పాటవుతుందన్నారు. మహిళా సాధికారిత కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో ఆలోచించి తీసుకుని వచ్చిన ఈ కార్యక్ర మాన్ని మహిళలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. తెలియజేస్తున్నామన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఇలా అన్ని కార్పొరేషన్ల ద్వారా ఈ శిక్షణ కార్యక్రమాలు, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి రుణాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీబీ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ ఛైర్మన్ దస్తగిరి, కమిషనర్ సుభాష్ చంద్రబోస్, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

### భాధిత కుటుంబాలకు భరోసా సీఎం సహాయ నిధి



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, మే 7)**

భాధిత కుటుంబాల పాలిట భరోసా సీఎం సహాయ నిధి అని మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం వెల్దుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ.7 లక్షలు విలువ చేసే సీఎంఆర్ఎఫ్ నగదు చెక్కులను బాధితులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉండి, హాస్పిటల్ బిల్స్ కట్టలేని పేదలకు కూటమి ప్రభుత్వం బాసటగా నిలుస్తుందని ఆయన చెప్పారు. నియోజకవర్గం పరిధిలో ఇప్పటి వరకు దాదాపు 300 మందికి రూ. 4 కోట్లు విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ నగదు చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

### సోమశిల జలాశయం నుంచి నీటిని విడుదల చేసిన మంత్రి ఆనం









**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 7)**

సోమశిల జలాశయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు అనంతరం గంగమ్మ తల్లికి చీర సారే జలహారతి సమర్పించి నీటిని రాష్ట్ర దేవాదయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి బుధవారం విడుదల చేశారు. నెల్లూరు జిల్లాలో రెండో పంట రబీకి సోమశిల జలాశయం నుంచి నీటిని విడుదల చేశారు. రెండో పంటకు నీరు విడుదల చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి, రామనారాయణరెడ్డికి రైతులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సోమశిలకి విచ్చేసిన మంత్రికి స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు, అధికారులు ఘన స్వాగతం పలికారు.

### నాయకులు, కార్యకర్తలతో నేదురుమల్లి భేటీ



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 7)**

వాకాడులోని నేదురుమల్లి నివాసంలో బుధవారం వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ రామ్ కుమార్‌రెడ్డితో కోట, వాకాడు, చిట్టమూరు మండల నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నాయకులతో కార్యకర్తలతో ఉద్దేశించి రామ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం యొక్క అరాచకాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, దానిలో భాగంగానే మండలాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారిని తొలగించి అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. వీరు చేస్తున్న అరాచకాల కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో రోజురోజుకి వైసీపీ ప్రజాదరణ పొందుతుందని, ప్రజలే ఇప్పుడే బాగా అర్థం చేసుకొని వైఎస్ఆర్సిపి పార్టీకి బలోపేతానికి అన్ని విధాల ముందుకొస్తున్నారు అని అన్నారు. టిడిపి ప్రభుత్వ పతనానికి దగ్గరలో ఉందని రామ్ కుమార్‌రెడ్డి నాయకులకు, కార్యకర్తలకు తెలియజేశారు.

### ధనుంజయ నాయుడికి మాతృవియోగం



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 7)**

వెంకటాచలం మండలం కనుపూరుకు చెందిన టీడీపీ నాయకుడు ఉప్పులపాటి ధనుంజయ నాయుడికి మాతృవియోగం జరిగింది. ధనుంజయ నాయుడిని పరామర్శించి ఆయన తల్లి భౌతికకాయానికి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నివాళులర్పించారు.

## అంజిరెడ్డి హాస్పిటల్లో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందనజ

జఈఎస్ఐ వారికి కూడా వైద్య సేవలు ప్రారంభంః
డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డిజ



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, మే 7)**

మాచర్ల పట్టణంలోని రామ టాకీస్ లైన్లో ఉన్న డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్ లో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 200 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈసీజీ, రక్త పరీక్షలు ఈ శిబిరంలో ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పిడుగురాళ్ల, మాచర్ల, నరసరావుపేట పట్టణాలలో అంజిరెడ్డి హాస్పిటల్స్ ద్వారా పల్నాడు ప్రాంత ప్రజలే కాక దూర ప్రాంతాలనుండి కూడా వచ్చి వైద్య సేవలు పొందుతున్నారని అన్నారు. ఇప్పటివరకు ఆరోగ్యశ్రీ,

ఈహెచ్ఎస్, ద్వారా ఉచితంగా ఆరోగ్య సేవలు అందించినట్లు తెలిపారు. ఇప్పటినుండి ఈఎస్ఐ కార్డు ఉన్నవారికి కూడా ఉచితంగా వైద్య సేవలు అందించనున్నట్లు ఆయన తెలిపారు. దీని ద్వారా అన్ని రకాల ఆపరేషన్లు ఉచితంగా చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరంలో డాక్టర్ నవీన్,డాక్టర్ సాయి,డాక్టర్ భరత్,డాక్టర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి పెంచలకోన బ్రహ్మోత్సవాలు



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 7)**

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ పెనుసుల నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి అంగరంగ వైభవంగా జరగనున్నాయి. దీనికి సంబంధించి దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాలకు ఒక నెల్లూరు జిల్లా నుంచి గాక, ఇతర రాష్ట్రాల నుంచి కూడా అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు వివరించారు.

## నేటి యువతకు దశా, దిశా నిర్దేశించే మహోన్నత వ్యక్తి అల్లూరి సీతారామరాజు





**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 7)**

నేటి యువతకు దశ ,దిశ నిర్దేశించే మహోన్నత వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని అల్లూరి సీతారామరాజు జాతీయ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి రమాదేవి అన్నారు. సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బుధవారంనెల్లూరు మద్రాస్ బస్టాండ్ వద్ద బి జే ఎం ఎం ఆటో యూనియన్ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు స్వతంత్ర పోరాటంతో పాటు మన్యంలో చైతన్యం కలిగించిన మహోన్నత వ్యక్తిని ఆమె కొనియాడారు. భారతదేశంపై పాకిస్తాన్ టెర్రరిస్ట్ చేసిన దాడికి బదులుగా మన సైన్యం ప్రతికార తీర్చుకుందని టెర్రరిస్ట్ శిబిరాలను నేలమట్టం చేసిందని ఈ దాడిలో కేవలం టెర్రరిస్టు శిబిరాలను మాత్రమే ధ్వంసం చేయడం జరిగిందన్నారు సైన్యానికి ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా మన ప్రభుత్వం ముందు జాగ్రత్తగా అన్ని రకాల చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. అందుకు భారత సైన్యాన్ని కేంద్ర ప్రభుత్వాన్ని నీకి భారతీయులు పూర్తి సహకారం అందిస్తారన్నారు. అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితోనే యువత విద్యార్థులు దేశ అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జయప్రకాష్ ఆటో సంఘం అధ్యక్షులు రమణయ్య. చంటి.జనార్ధన్. అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి సీతారామరాజు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలి

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా









**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 7)**

మన్యం వీరుడు, స్వాతంత్ర్య పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం ఒంగోలులోని మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు, బి ఎన్ విజయకుమార్, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, పలు సంఘాల నేతలు, జిల్లా అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమన్నారు. అల్లూరి సీతారామరాజు చేసిన స్వాతంత్ర్య పోరాటం ఎందరో వీరులకు స్ఫూర్తినిచ్చిందని అన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ వారికి ఎదురునిలిచి అడవి బిడ్డలకు అండగా నిలిచి 27 సంవత్సరాల వయస్సు లోనే ప్రాణత్యాగం చేసిన యోధుడు అల్లూరి అన్నారు. బ్రిటిష్ వారికి చెప్పి వారి ఆయుధాలు కొల్లగొట్టిన మొనగాడు సీతారామరాజు అని అన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బి.ఎన్.విజయకుమార్ మాట్లాడుతూ అడవి బిడ్డల హక్కుల కోసం పోరాటం చేసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని వీరిని స్ఫూర్తిగా తీసుకుని వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు ముందుకు సాగాలన్నారు. ఒంగోలు మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ వారిని ధైర్యంగా ఎదురొడ్డి వీరోచితంగా ప్రాణాలు విడిచిన మహానాయకుడు అల్లూరి సీతారామరాజు అని, వీరు చేసిన త్యాగాలు వెలకట్టలేనివన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి వరలక్ష్మి, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి అంజల, సెట్నల్ సీఈఓ శ్రీమన్నారాయణ, పలు సంఘాల నేతలు, కమిటీ సభ్యులు రావూరి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

# పిఎన్ఆర్ కాలనీలో వేసవి వినోద ప్రారంభం

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 7)**




ప్రకాశం బాలోత్సవం ఆధ్వర్యంలో పొదిలిలోని పిఎన్ఆర్ కాలనీ నందు వేసవి వినోద ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పొదిలి జెవివి జిల్లా కార్యదర్శి బి దేవప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రకాశం బాలోత్సవం ప్రధాన కార్యదర్శి కే సుబ్రహ్మణ్యం, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్కె అబ్దుల్ హై హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు సెల్ ఫోన్, టీవీలకు బానిసలు కాకుండా, వినూత్నంగా ఆలోచించేటట్లు చేయడానికి, వారిలో ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయటానికి ఈ వేసవి వినోద కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం వారం రోజులు పాటు నిర్వహించబడుతుందన్నారు. ఆసక్తి కలిగిన 4 నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులు ఈ సమ్మర్ క్యాంపులో పాల్గొనవచ్చును. ఈ క్యాంపులో కథలు, పాటలు, పద్యాలు, సైన్స్ ప్రయోగాలు, మ్యాజిక్ అంశాలు, డ్యాన్స్, డ్రాయింగ్, ఓరిగామి మొదలైన అంశాల గురించి నేర్పించడం జరుగుతుంది. ఈ ప్రారంభ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు మీకు ఇష్టమైన అంశాలను ఎంపిక చేసుకుని వాటిలో పరిపూర్ణమైన జ్ఞానాన్ని పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొదిలి డివిజన్ యుటిఎఫ్ నాయకులు పి వెంకటేశ్వర్లు, నాజర్ అహ్మద్ ,గోనె శీను, సంజీవరావు, కె వెంకటేశ్వర్లు, 40 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి రోజు విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలు చేసే విధానం గురించి వివరించి పిల్లలచే చేయించారు. ఆసక్తికరమైన కథలను చెప్పడం జరిగింది.



## మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 7)**

స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో బుధవారం డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ట్రాక్టర్, ఆటో డ్రైవర్లు పరిమితం మించి రైతు కూలీలు గాని, ప్రయాణికులు గాని వాహనంలో ఎక్కించుకున్నట్లయితే కఠిన చర్యలు తప్పవని, అలాగే 18 సంవత్సరాల నిండకుండా పిల్లలు వాహనాలు నడిపినట్లయితే తగు చర్యలు తప్పవని, మద్యం తాగి వాహనాలు నడిపినట్టైతే, ద్విచక్ర వాహనంపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రతి ఒక్క వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్ సి, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ అనుక్ పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

# పిల్లలకు ఏ చికిత్స అయినా ఉచితం

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 7)**

రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం కింద పిల్లలకు ఏ చికిత్స అయినా ఉచితంగా చేయడం జరుగుతుందని, ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. బుధవారం జీజీహెచ్లోని జిల్లా బాల భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ పోర్టబుల్ ఎక్స్ రే యూనిట్‌ను , పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల స్మైల్ ట్రైన్ ఫౌండేషన్ వారి సహకారంతో నిర్వహిస్తున్న గ్రహణ మొర్రి, పెదవి చీలిక, అంగటి చీలిక టెస్ట్ స్క్రీనింగ్ క్యాంపెయిన్ ను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రహణ మొర్రి, పెదవి చీలిక మరియు అంగటి చీలిక కలిగిన పిల్లల తల్లిదండ్రులతో జిల్లా కలెక్టర్ మాట్లాడి వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రహణ మొర్రి, పెదవి చీలిక మరియు అంగటి చీలిక శస్త్ర చికిత్స విధానంను, అయ్యే ఖర్చును సంబంధిత వైద్యులు, జిల్లా కలెక్టర్ కు వివరించారు. అనంతరం హ్యాండ్ పోర్టబుల్ ఎక్స్ రే యూనిట్ పని విధానంను జిల్లా కలెక్టర్ పరిశీలన చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం కింద జిల్లాలో గ్రహణ మొర్రి, పెదవి చీలిక, అంగటి చీలిక కలిగిన 30 మంది పిల్లలను గుర్తించడం జరిగిందన్నారు. వీరికి పిన్నమినేని సిద్ధార్థ వైద్య కళాశాల స్మైల్ ట్రైన్ ఫౌండేషన్ వారి సహకారంతో శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు ఈ రోజు జిజిహెచ్ నందు టెస్ట్ స్క్రీనింగ్ క్యాంపెయిన్‌ను నిర్వహించడం జరిగిందన్నారు. వీరందరికీ ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఒక్కో శస్త్రచికిత్సకు సుమారు 50 వేల రూపాయలు దాకా ఖర్చు అవుతుందన్నారు. ఒక్కొక్కరికి మూడు శస్త్రచికిత్సలు చేయాల్సి ఉండగా మొత్తం లక్షన్నర నుండి రెండు లక్షల వరకు ఖర్చు అవుతుందని, శస్త్ర చికిత్స అనంతరం స్పీచ్ థెరిపి, టీత్ అలైన్మెంట్ నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. గ్రహణ మొర్రి, పెదవి చీలిక , అంగటి చీలిక కలిగిన వారు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిజిహెచ్ లో టిబి హ్యాండ్ పోర్టబుల్ ఎక్స్ రే యూనిట్ ను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ యూనిట్ నిర్వహణకు సంబంధించి సిబ్బందికి శిక్షణ కుడా ఇవ్వడం జరిగిందని, ఈ యూనిట్ ద్వారా రోజుకు సుమారు వంద ఎక్స్‌రేలు తీయవచ్చునని కలెక్టర్ వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డెర్మటో సర్జరీ యూనిట్‌ను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, జిజిహెచ్ సుపరింటెండెంట్ డాక్టర్ జమున, క్లెఫ్ట్ ప్రాజెక్ట్ స్మైల్ ట్రైన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీకాంత్, సిద్దార్ధ డెంటల్ కళాశాలకు చెందిన డాక్టర్ సుధా నాగేశ్వరరావు, జిజిహెచ్ వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.












# మన్యం వీరుడు అల్లూరి జీవితం తరతరాలకు స్ఫూర్తిదాయకం



మన్యం వీరుడు శ్రీ అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 7)

స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ వీరుడు, అగ్గి పిడుగు అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి సందర్భంగా బుధవారం గుంటూరు రోడ్డులోని ఏ వన్ కన్వెన్షన్ హాల్ ఎదురుగా ఉన్న శ్రీ అల్లూరి సీతారామరాజు విగ్రహానికి, జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్, పోలీస్ అధికారులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బ్రిటిష్ వారి గుండెల్లో సింహస్వప్నంగా నిలిచిన విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు పోరాటపటిమను కొనియాడారు. బ్రిటిష్ వారి నిరంకుశ చర్యలు వలన మన్యం ప్రజలు ఎదుర్కొంటున్న దీనస్థితిగతులను పరిశీలించి ప్రజలను చైతన్య పరిచి విప్లవానికి నాంది పలికాడని, మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడి 27 ఏళ్ల వయసు లోనే ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి అని, ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వతంత్ర చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయమని, అతడి దేశభక్తి స్ఫూర్తి, భారతీయ జాతీయవాదం జ్వాలలను రేకెత్తించిందని, దేశంలో బ్రిటిష్ పాలకుల దోపిడీ, దురాగతాలు, దమనకాండలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేపట్టేందుకు అనేకమందిని ప్రేరేపించిందని గుర్తుచేశారు. అల్లూరి సీతారామరాజు గారు చింతపల్లి ఏరియాలో ఉద్యమం చేసిన ప్రాంతంలో తను ఓఎస్డిగా పని చేశాన్నారు. సీతారామరాజు గారు సాగించిన సాయుధ పోరాటం తెలుగు జాతి చరిత్రలో గొప్ప ఘట్టంగా చిరస్థాయిగా నిలిచి ఉంటుందని, తెలుగు జాతి తెగువకు నిలువెత్తు నిదర్శనమని, ఆయన త్యాగశీలిని, పోరాటపటిమను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత సమాజాభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, ఒంగోలు వన్ టౌన్ సీఐ నాగరాజు, ఒంగోలు టు టౌన్ సీఐ శ్రీనివాసరావు, ఆర్ఐలు రమణ రెడ్డి, సీతారామిరెడ్డి, ఏఆర్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# అసంఘటిత కార్మికులకు చట్టాలపై అవగాహన




(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 7)

మేడే వారోత్సవాల్లో భాగంగా బుధవారం కనిగిరి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి బి రూపశ్రీ ఆధ్వర్యంలో కనిగిరి పట్టణంలోని పివిఆర్ పార్క్ నందు అసంఘటిత కార్మికులకు చట్టాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సయ్యద్ షాహిద్ మాట్లాడుతూ వేతన సవరణ చట్టం, హక్కులు, బాధ్యతల గురించి తెలియజేశారు.జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 15100 కు ఫోన్ చేసి న్యాయ సలహాలను పొందవచ్చునని సూచించారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు కార్మిక శాఖ సహకారంతో వివిధ ప్రభుత్వ శాఖలు, గుడ్ హెల్ప్, పారా లీగల్ వాలంటీర్లు, న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అసంఘటిత కార్మికులకు వారం రోజులపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. కార్మిక శాఖ అధికారి సుబ్బారాయుడు కార్మిక శాఖలో అమలవుతున్న ప్రభుత్వ పథకాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల గుమస్తాల సంఘం అధ్యక్షులు సయ్యద్ యాసిన్,పోలీస్ బాలకృష్ణ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## దాసరి గణేష్‌కు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయస్వామి



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 7)

బుధవారం విజయవాడ లోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో పదవ తరగతి ఉత్తమ ప్రతిభ కనబరిచిన పొన్నలూరు గిరిజన ఉన్నత పాఠశాల విద్యార్థికి మెమెంటోను ఇచ్చి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పైడిపాటి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు

# క్విస్ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

సేవలు అందించిన కిమ్స్ వైద్యులు
200 మందికిపైగా ఉచిత వైద్యసేవలు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 7)

ఒంగోలు క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ ఎస్ ఎస్, కిమ్స్ హాస్పిటల్స్ ఒంగోలు వారు మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఒంగోలు మండలం సర్వేరెడ్డి పాలెంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో దాదాపు 200 మంది గ్రామస్థులు వైద్యసేవలు వినియోగించుకున్నారు. ఈ వైద్య శిబిరంలో షుగర్, బి.పి. గుండె, గ్యాస్ట్రబుల్, ఎముకలు, కీళ్ళు, నరములు, స్త్రీ సంబంధిత, కంటి సంబంధిత పరీక్షలు ఉచితంగా చేశారు. ఇ.సి.జి, షుగర్, బి.పి. పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలని, విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక సేవ కూడా అలవాటు పడేలా ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు. ఎన్ ఎస్ ఎస్ ద్వారా ఇప్పటికే ఎన్నో కార్యక్రమాలు నిర్వహించామని విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి చెప్పారు. వైద్య శిబిరం నిర్వహించి ప్రజలకు సేవ చేయడం ఆనందంగా ఉందని, క్విస్ కళాశాల, ఎన్ ఎస్ ఎస్ ద్వారా ఇలాంటి సేవా కార్యక్రమాలు ముందు ముందు ఇంకా నిర్వహిస్తామని విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి అన్నారు. ఈ వైద్య శిబిరంలో కిమ్స్ కి చెందిన డాక్టర్ అశోక్ కుమార్ (గ్యాస్ట్రో), డాక్టర్ లక్ష్మీ శ్వేత (జనరల్ మెడిసిన్), డాక్టర్ ఉదయ్ కుమార్ (ఆర్థో), డాక్టర్ ఆనంద యాదవ్ (కార్డియాలజీ), డాక్టర్ రామాంజనేయులు (జనరల్ మెడిసిన్) తమ సేవలు అందించారు. ఈ కార్యక్రమాన్ని క్విస్ కళాశాల ఎన్ ఎస్ ఎస్ డీన్ డాక్టర్ నవనీత కృష్ణన్, ఎన్ సీసీ హెడ్ డాక్టర్ వాసుబాబు, ఎన్ ఎస్ ఎస్ పీవోలు శిరీష, వేణుగోపాల్ పర్యవేక్షించారు. ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు వృద్ధులకు, నడవలేని వారికి సాయం చేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ ఛైర్మన్ పి.సుబ్బారావు, పంచాయతి సెక్రటరీ భాగ్యలక్ష్మి, స్కూల్ హెడ్ మాస్టర్ రత్న ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ కోసం కష్ట పడ్డ వారికే పదవులు



(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, మే 7)

పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతున్న వారికే గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శుల పదవులకు ఎంపిక చేయాలని మండల కమిటీ నాయకులను టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ఆదేశించారు. దేవరాజు గట్టు ఇందిరా ప్రియదర్శిని కాలేజి ఆవరణలో బుధవారం జరిగిన పెద్దారవీడు మండల కార్యక ర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ మండల అధ్యక్షుడు మెట్టు శ్రీనివాస రెడ్డి అధ్యక్షోపన్యాసం చేశారు. కుటుంబ సాధికారసారథలను నియమించడంలో జిల్లాలో ఎర్రగొండపాలెం ప్రథమ స్థానంలో ఉందని ఎరిక్షన్బాబు అన్నారు. అన్ని గ్రామాల్లో పార్టీ సంస్థాగత పదవు లకు మే 18వ తేదీలోపు కమిటీలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్ర బాబు ఆదేశించారని, ఆ మేరకు కమి టీను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. పెద్దారవీడు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్చార్జి ఎరిక్షన్‌బాబు గ్రామ కమిటీలు, అనుబంధ సంఘాలు, క్లస్టర్ యూనిట్, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శి పదవులకు కమిటీలను నియ మిస్తున్నట్లు ఎరిక్షన్బాబు తెలిపారు. గ్రామాల్లో కార్యకర్తల అభిప్రాయం మేరకు గ్రామ కమిటీలకు అభ్యర్థులను ఎన్నుకోవాలని మండల కమిటీ నాయకులకు ఆదేశించినట్లు చెప్పారు. అనంతరం గ్రామ పంచాయతీల వారీగా గ్రామ కమిటీ కార్యవర్గాలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గుమ్మ గంగ రాజు, మండల మాజీ అధ్యక్షుడు గొట్టం శ్రీనివాస రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రవి, సర్పంచ్ ఆకుమల్ల శ్రీనివాసరెడ్డి, నక్క శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 7)

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, ఆప్కాస్ రద్దు అంశాన్ని ఉపసంహరించుకోవాలని, గత సమ్మె కాల ఒప్పందాల జీవోలను ఇవ్వాలని రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మున్సిపల్ కార్మికులు మస్టర్ పాయింట్‌లో ధర్నాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు చీకటి శ్రీనివాస రావు మాట్లాడుతూ మే 20, 21, 22 మూడు రోజులు సమ్మెకు సన్నద్ధం కావాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను.. తీసుకు వస్తున్నారన్నారు. దానికి వ్యతిరేకంగా. కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి నిరసనగా మే 20న మున్సిపల్ కార్మికులందరూ సమ్మెకు సన్నద్ధం కావాలని ఆయన అన్నారు. గత ప్రభుత్వం.. 17 రోజులు సమ్మె సందర్భంగా కార్మిక నాయకులతో హామీలు ఇవ్వడం జరిగింది. ప్రభుత్వం మారేసరికి సమ్మె కాల ఒప్పందాల జీవోలను కూటమి ప్రభుత్వం ఇవ్వకుండా మున్సిపల్ కార్మికులపై కక్ష సాధింపు చర్యలు చేస్తుందన్నారు. పని భారం విపరీతంగా మోపింది.. కోవిడ్ కార్మికులకు.. గత ఎనిమిది సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తూ ఉంటే.. కనీస వేతనం.. 12000 మాత్రమే చెల్లిస్తుంది.. కవిత్ కార్మికులకు 21 వేతనం ఇవ్వాలని.. ఇంజనీరింగ్ కార్మికులకు. పార్కులో పనిచేసే కార్మికులకు.. వాటర్ వర్క్స్ కార్మికులకు. వర్క్ ఇన్స్పెక్టర్లకు.. కనీస వేతనాలు అమలు చేయకుండా. ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయి. తక్షణమే.. మున్సిపల్ కార్మికులు సమస్యలు. పరిష్కారం కాకపోవటం వల్లనే.. మరోసారి మున్సిపల్ కార్మికులు. సమ్మె సమ్మెబాట పట్టారన్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి.. కొర్నెపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ 60 సంవత్సరాల నుండి అని, ప్రకాశం జిల్లాలో ఒంగోలు, చీమకుర్తి, పొదిలి,కనిగిరి ,గిద్దలూరు, మార్కాపురం,దర్శిలో మున్సిపల్ కార్మికులను విధుల నుంచి ఆపారని, ఆగ్ర మున్సిపల్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్.. వాళ్ళ కుటుంబాలను. సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. చనిపోయిన. కార్మికులకు వాళ్ల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని, అనేకసార్లు. రాష్ట్ర మంత్రులకు. ఉన్నతాధికారులకు. వినతి పత్రాలు ఇచ్చిన పరిష్కారం కాకపోవటం వల్ల.. మున్సిపల్ కార్మికులు.. సమ్మె చేయడానికి సన్నద్ధం అయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు.. వై రవికుమార్, సిహెచ్ అక్కేశ్వరరావు, బి అరుణ కుమారి,కే పద్మ,బి చిన్నబ్బాయి,డి వెంకట్రావు, కే వెంకటరమణ, జయలక్ష్మి, కుమారి సుబ్రహ్మణ్యం, పి పద్మ, వి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.



# ఇది రైతు ప్రభుత్వం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి







(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, మే7)

ఇది రైతు ప్రభుత్వం అని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని ఏఎంసి ఆవరణలో మార్కాపురం నియోజకవర్గానికి చెందిన 155 మంది రైతులకు సబ్సిడీ వ్యవసాయ పరికరాలు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ 2024- 25 చెందిన మూడు నెలల బడ్జెట్ కి మాత్రమే ఈ వ్యవసాయ పరికరాలు సబ్సిడీలపై అందజేస్తున్నామని వచ్చే 2025 -26 బడ్జెట్లో ఎక్కువమంది రైతులకు న్యాయం చేస్తామని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దివాలా తీయించిందని అంపశయ్యపై ఉన్న రాష్ట్రాన్ని గౌరవ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు గాడిలో పెడుతున్నారని అయినా కూడా రైతులకు అందించే సబ్సిడీ విషయంలో ఎక్కడ రాజీ పడకుండా గత వైసిపి ప్రభుత్వం కన్నా విన్నగా రైతులను ఆదుకుంటున్నారని అన్నారు. వచ్చే రెండేళ్లలో వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసి మన ప్రాంతంలో కూడా సంవత్సరానికి మూడు పంటలు పండే విధంగా చేస్తామని అన్నారు. రాబోయే రోజుల్లో రైతు భరోసా పథకం ద్వారా రైతులకు మూడు విడతల్లో రూ.20,000 రైతులు ఎకౌంట్లో ఈ సంవత్సరం జమ చేయబోతున్నామని అన్నారు. ఇప్పటికైనా రైతులందరూ ఏకగ్రీవంగా తెలుగుదేశం పక్షాన నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, ఆయా మండలాల నుంచి విచ్చేసిన రైతు సోదరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికులను హేళనగా మాట్లాడటం పై ధర్నా



(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 7)

పొదిలిలో నగర పంచాయితీ వర్కర్స్ పారిశుధ్య పనులు చేసే సందర్భంలో కాలనీల్లో పారిశుధ్య కార్మికులను తిట్టడం,కొట్టడం, చులకనతో హేళనగా మాట్లాడటంను నిరసిస్తూ నగరపంచాయితీ ఆఫిసు వద్ద ధర్నా చేయటం జరిగింది. పారిశుద్ధ్య కార్మికులను తిట్టడం,దూషించడం,కొట్టడం లాంటి చర్యలు మానుకోవాలని,అలా వ్యవహరించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని,నగరపంచాయితీ అధికారులు కార్మికులపై దాడులు చేయరాదని మైక్ ప్రచారం చేయాలని,సమస్య ఉంటే అధికారులకు కంప్లైంట్ చేయాలి తప్ప దాడులు చేయరాదని సిఐటియు జిల్లా ప్రధాన యం.రమేష్ అన్నారు.

# కన్నీరు పెట్టుకున్న మధుసూదన్ ఫ్యామిలీ



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 7)

సింధూర్ ఆపరేషన్‌కు కావలికి చెందిన మధుసూదన్ రావు ఫ్యామిలీ స్పందించింది. ఇటీవల జమ్మూ కాశ్మీర్లో ఉగ్రవాదుల దాడిలో మరణించిన విషయం పాఠకులకు విధితమే. దీనిపై భారత్ పాకిస్తాన్ పై ఉగ్ర దాడులు నివసిస్తున్న నివాసాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్ భార్య కామాక్షి స్పందిస్తూ తన భర్తను అరాచకంగా ఉగ్రవాదులు చంపారని దానికి భారత్ ప్రతీ కార్య చర్యలు తీసుకునిందని ఆమె అన్నారు. దానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఆమె కృతజ్ఞతలు తెలియజేసారు.

## కావలిలో అరాచక పాలన



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 7)
కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలపై ప్రశ్నిస్తున్న మీడియా సోదరులపై దాడులు చేస్తూ, అక్రమ కేసులు బనాయిస్తూ రాక్షసానందం పొందుతున్నారు. గతంలో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా చేసిన రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి సౌమ్యుడు, ప్రజలతో, మీడియా సోదరులతో ఎంత సఖ్యతతో మెలిగారో అందరికీ తెలిసిన విషయమే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అక్రమాలే రాజ్యమేలుతున్నాయని అందులో భాగంగా సముద్ర తీరంలోని ఇసుక, గ్రావెల్, చెరువుల్లో మట్టి దోపిడి చేస్తున్నారు. సముద్రపు ఇసుక, గ్రావెల్, మట్టి దోపిడీపై ప్రశ్నిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి పై, మీడియా సోదరులపై అక్రమ కేసులు పెడుతున్నారు. ఈ సమావేశంలో నెల్లూరు జిల్లా వైఎస్సార్సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పందిటి కామరాజు, తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నాయకులకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి పరామర్శ





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 7)
పొదలకూరు మండలం దుగ్గుంటలో అనారోగ్యానికి గురై కోలుకుంటున్న ఈతముక్కల బాబు నాయుడిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరాత్వరగా కోలుకుని ప్రజల్లోకి రావాలని ఆకాంక్షించారు. అనారోగ్యంతో బాధపడుతూ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తోటపల్లిగూడూరు మండలం ఇస్కపాళెం పంచాయతీకి చెందిన టీడీపీ నేత ఇంగిలేల విశ్వేశ్వర్ కి పలకరింపుఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో ఆరా తీసారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

## వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన కేతంరెడ్డి వినోద్‌రెడ్డి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 7)
నగరంలోని సిరి మల్టీప్లెక్స్ థియేటర్ సమీపంలో మల్లేపల్లి వినయ్ కుమార్ ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ను నెల్లూరు టిడిపి నాయకులు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి ఘనంగా ప్రారంభించారు. బుధవారం ఉదయం వాటర్ ప్లాంట్ ను ప్రారంభించిన వినోద్ రెడ్డి సందర్భంగా మాట్లాడుతూప్రజలకు శుద్ధిజల అందించేందుకు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్‌ను అభినందించారు. ప్రజలు శుద్ధి జల కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

## సంపత్ కుమార్‌ను పరామర్శించిన మాజీ మంత్రి ప్రసన్న



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 7)
నెల్లూరు మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ వీరి చలపతిరావు సోదరుడు వీరి సంపత్ కుమార్ కామెర్లతో నెల్లూరులో మాగుంట లేఅవుట్‌లోని ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. ఆయనను మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి పరామర్శించారు. అలాగే వైద్య వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు కలువ బాల శంకర్‌రెడ్డి, కోవూరు నియోజకవర్గ వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు అన్నపల్లి ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

# ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్క్ నియోజకవర్గానికి ఒక వరం

### మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి







(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, మే 7)
ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్క్ నియోజకవర్గానికి ఒక వరమని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని కలుజువ్వలపాడు టోల్గేట్ వద్ద ఏపీఐఐసీ ఆధ్వర్యంలో నూతన ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్క్‌కు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఇండస్ట్రియల్ పార్క్ నియోజకవర్గానికి ఒక వరమని మొదటిగా 50 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేస్తారని, దీనిని 100 ఎకరాలకు విస్తరించవచ్చు అని మొదటిగా 15 కోట్లతో ఈ పార్కును ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. మార్కాపురంలోని ఎస్టేట్లో ఏ రకంగా పరిశ్రమలు ఏర్పాటు చేశారో అదేవిధంగా ఈ పార్క్‌ని అభివృద్ధి చేస్తామని ఇండస్ట్రియల్ పార్కులో వివిధ రకాల పరిశ్రమలు త్వరలో ఏర్పాటు చేయబోతున్నామని, దీని ద్వారా ఈ ప్రాంతంలో నిరుద్యోగులకు వందల సంఖ్యలో ఉద్యోగాలు కల్పించబోతున్నామన్నారు. అదే రకంగా రిలయన్స్ సంస్థ 1500 కోట్ల రూపాయలతో త్వరలో నియోజకవర్గంలో ప్లాంట్ నెల కల్పబోతున్నారని, దీని ద్వారా రైతులకు ఎకరానికి 30 వేల రూపాయల కౌలు లభించబోతోందని వందల సంఖ్యలో ఉద్యోగాలు రాబోతున్నాయని వేల సంఖ్యలో పరోక్ష ఉపాధి కల్పించబోతున్నామని అన్నారు. ఇక్కడి నుంచి రామాయంపట్నం పోర్టు 100 కిలోమీటర్లు, ఎయిర్పోర్టు సుమారు 150 కిలోమీటర్ల దూరంలోనే ఉన్నాయని ఈ ప్రాజెక్టు కూడా నేషనల్ హైవే పక్కనే ఉందని అందువల్ల ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి ఈ పారిశ్రామిక వాడలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ అధికారులు, తర్లుపాడు మండల ప్రజలు, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధే ధ్యేయంగా పనిచేసే నాయకులకు ప్రజలు అండగా ఉంటారు

### రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి







(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 7)
అధికారంలో ఉన్నప్పుడు ఆయా ప్రాంతాల అభివృద్దే ధ్యేయంగా పనిచేసే నాయకులకు ప్రజలు అన్నివేళలా అండగా ఉంటారని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం నెల్లూరు రూరల్ పరిధిలోని నల్లపురెడ్డి శ్రీనివాసులరెడ్డి విగ్రహం నుండి డైకాస్ రోడ్డు వరకు డివైడర్, సెంట్రల్ లైటింగ్, బిటి రోడ్డు వంటి అభివృద్ధి పనుల శంఖుస్తాపన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఎన్నో దశాబ్దాల తర్వాత తాను ప్రాతినిధ్యం వహించిన ఒకప్పటి రాపూరు నియోజవర్గం నేటి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అడుగిడిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి స్థానిక ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం 2 కోట్ల 67 లక్షల విలువ చేసే అభివృద్ధి పనుల శంకుస్థాపన శిలాఫలకమును మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానికులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ నెల్లూరు ప్రాంతం అతి సున్నితమైన ప్రాంతమని, అటువంటి ప్రాంతంలో వరుసగా మూడుసార్లు శాసనసభ్యులుగా గెలవడం సామాన్య విషయం కాదన్నారు. గతంలో దివంగత నేత ఆనం వివేకానంద రెడ్డి, ప్రస్తుతం శ్రీధర్ రెడ్డిలకు మాత్రమే ఇటువంటి అపూర్వ అవకాశం కలిగిందన్నారు. సేవా దృక్పథంతో, చిత్తశుద్ధితో పనిచేసినప్పుడే ప్రజలు ఆదరిస్తారన్నారు. అదేవిధంగా కేవలం రెండు నెలల్లో 339 అభివృద్ధి పనులు పూర్తిచేయడం శ్రీధర్ రెడ్డికే సాధ్యమైనదన్నారు. రాజకీయాలంటే నిరంతర విద్య మాదిరియేనని, సమాజం యొక్క ఆలోచన విధానాన్ని అర్థం చేసుకుంటేనే విజయం సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని చిత్తశుద్ధి కలిగిన అపార అనుభవం కలిగిన నేత ఉండడంతో అభివృద్ధి పనులు ఒక్కొక్కటిగా పూర్తి చేస్తున్నామన్నారు. ఇందుకు ప్రజలందరి సంపూర్ణ సహకారం అవసరమన్నారు. గతంలో పూర్తిగా నిర్వీర్యమై పోయిన వ్యవస్థలను కేవలం పది నెలల్లో గాడిలో పెట్టిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి తెలిపారు. ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యమే గత నెలలో 3600 కోట్ల జీఎస్టీ రాష్ట్రం నుంచి వసూలైనదన్నారు. ఇదే విధమైన అభివృద్ధిని కొనసాగించి రాబోయే ఏడాది లోపు పూర్తిస్థాయిలో రాష్ట్రం ఆర్థికంగా కుదుట పడుతుందన్నారు. అదేవిధంగా మన పొరుగు దేశం తీవ్ర అప్పుల పాలై, అచేతన వ్యవస్థలో ఉండి ఉగ్రవాదాన్ని భారతదేశం పైకి ఉసిగొల్పిన ప్రస్తుత తరుణంలో ప్రజలందరూ దేశ రక్షణకై ప్రధానమంత్రి, ముఖ్యమంత్రిలకు తమ సంపూర్ణ సహకారం అందించాలన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో తనదైన ప్రత్యేక ముద్ర వేసిన వ్యక్తి ఆనం రామ నారాయణ రెడ్డిని, మంత్రి చేతుల మీదుగా నేడు శంకుస్థాపన గావించిన అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తి నాణ్యతా ప్రమాణాలతో నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ భాను శ్రీ, నాయకులు గిరిధర్ రెడ్డి, రంగ మయూర్ రెడ్డి, గిరి నాయుడు, కార్పొరేటర్ అహల్య తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విదేశీ విద్యా పథకం, బేబి కీట్స్ పథకాలను పునరుద్ధరించాలి

### తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి




(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 7)
విదేశాలలో విద్యనభ్యసించే పేద పిల్లలకు ఆర్థిక సహాయం చేయడం కోసం, నాటి తెలుగుదేశం ప్రభుత్వం అంబేద్కర్ విదేశీ విద్యా పథకాన్ని ప్రవేశపెట్టింది. 2019లో అధికారం లోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఈ పథకానికి పేరు మార్చి, నిర్వీర్యం చేసింది.ప్రభుత్వ హాస్పటల్లో కాన్పు చేసుకొనే తల్లులకు నాటి టిడిపి ప్రభుత్వం ఎన్టీఆర్ బేబి కీట్స్ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తే,వైసిపి ప్రభుత్వం ఈ పథకాన్ని కూడా నిలిపివేసింది. వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిన అంబేద్కర్ విదేశీ విద్యా పథకం, బేబి కీట్స్ పథకాలను పునరుద్ధరించాలని నిర్ణయించిన ముఖ్యమంత్రికి ధన్యవాదములు అని కోవూరు లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేఖర్ల సమావేశంలో తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2014-19 మధ్య అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం విదేశాలలో ఉన్నత విద్య చదివే విద్యార్థులకు ఆర్థిక సహాయం చేయడం కోసం అంబేద్కర్ విదేశీ విద్యా పథకంను ప్రవేశ పెట్టీ అమలు చేసింది.ఈ పథకం వలన అనేక మంది పేద విద్యార్థులు ప్రభుత్వం ఆర్థిక సహాయం తో విదేశాలలో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు వెళ్లారు. 2019 లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఈ పథకాన్నీ పూర్తిగా నిలిపివేసింది. హైకోర్టు ఆదేశాల మేరకు తప్పనిసరి పరిస్థితులలో ఈ పథకానికి జగనన్న విదేశీ విద్యా పథకం పేరు మార్చి, ఆచరణ సాధ్యం కాని అనేక నిబంధనలు పెట్టీ ఈ పథకాన్ని నిర్వీర్యం చేసింది. 2019కి ముందు ఈ పథకం క్రింద ఎంపికై విదేశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు తదుపరి చెయ్యవలసిన ఆర్థిక సహాయం కూడా వైసిపి ప్రభుత్వం చేయక పోవడంతో విద్యార్థులు తమ సొంత డబ్బులతో మిగిలిన చదువులు పూర్తి చేసుకున్నారు. ఎప్పుడు పేద ప్రజలు గురించి ఆలోచించే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు విద్యార్థులు కొరకు విదేశీ విద్యా పథకాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించారు. ఈ పథకానికి అంబేద్కర్ విదేశ విద్యా నిధి అని పేరు పెట్టాలని,ఈ పథకం క్రింద విదేశాలకు వెళ్లి ఉన్నత చదువులు చదువుకొనే ఈబీసీ విద్యార్థులకు రూ.25 లక్షలు, బీసీ, మైనార్టీ విద్యార్థులకు రూ.20 లక్షలు,ఈబీసీ, కాపు విద్యార్థులు కు 15 లక్షలు చొప్పున ఆర్థిక సహాయం చేయాలని,అదే విధంగా ఎక్కువ మంది విద్యార్థులకు ఉపయోగపడేలా నిబంధనలు రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారాలను ఆదేశించారు. ఇంతటి గొప్ప నిర్ణయాన్ని తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నానన్నారు.

**బేబి కీట్స్ పథకం :** ప్రభుత్వ హాస్పిటల్స్ లో కాన్పులు చేసుకొనే తల్లులకు బేబి కీట్స్ ఇచ్చే పథకం ను నాటి తెలుగుదేశం ప్రభుత్వం 2016 జులై 1 వ తేదిన ఎన్టీఆర్ బేబి కీట్స్ పేరుతో ప్రవేశపెట్టింది. ఈ పథకం క్రింద బేబి ల సంరక్షణ కొరకు ఉపయోగపడే 11 రకాల వస్తువులను నాటి ప్రభుత్వం ఉచితంగా అందించింది.అయితే ఈ పథకాన్ని కూడా వైసిపి ప్రభుత్వం వైఎస్ఆర్ బేబి కీట్స్ అని పేరు మార్చి కొద్ది రోజులు అమలు చేసి 2021 నుండి నిలిపి వేసింది. ప్రభుత్వ హాస్పిటల్స్ లో కాన్పు చేసుకొన్న పేదల పిల్లలు ఎంతో ఉపయోగపడే బేబి కీట్స్ పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. దీని వలన ప్రతి ఏడాది దాదాపుగా 4 లక్షల మంది తల్లులకు మేలు జరుగుతుంది.రూ.1410 రూపాయల విలువ గలిగిన 11 వస్తువులను ప్రభుత్వం ఉచితంగా అందచేస్తుందన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# వాసవి సేవాదళ్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య ఆణిముత్యాలకు ఘన సత్కారం

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 7)**

కందుకూరు వాసవి సేవాదళ్ ఆధ్వర్యంలో శ్రీ వాసవి మాత జయంతి సందర్భంగా శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ కోఆర్డినేషన్‌తో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో బుధవారం కందుకూరు నియోజకవర్గంలో ఉన్నటువంటి ఆర్యవైశ్య విద్యార్థిని విద్యార్థులకు 2023-24 పదవ తరగతి, ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరము నందు ప్రతిభ కనబరిచిన 35 మంది ఆర్యవైశ్య ఆణిముత్యాలను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులు,నగర ఆర్యవైశ్య దాతల చేతుల మీదుగా వారిని ఘనంగా సన్మానించి బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ధర్మతేజ, ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి గుర్రం సింగయ్య, ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య మీడియా చైర్మన్ డాక్టర్ చక్కా వెంకట కేశవరావు, వాసవి సేవాదళ్ ఉపాధ్యక్షులు డాక్టర్ రవ్వా శ్రీనివాసులు మాట్లాడుతూ గతంలో ఆర్యవైశ్యులు కేవలం వ్యాపారాలకే పరిమితమయ్యేవారు, కానీ నేటి రోజుల్లో వ్యాపారాలతో పాటు మంచి మంచి ఉద్యోగాల్లో స్థిరపడి ఉన్నారు. విద్య జీవితంలో ఎంతో విలువైనదని, మంచి విద్య కుటుంబ స్థితిగతులనే మార్చేస్తుంది అని అన్నారు. డబ్బుతో సాధించలేనిది మంచి భవిష్యత్తు సాధించవచ్చు అని అన్నారు. డబ్బు అయినా పోతుందేమో కానీ విద్యను ఎవరు దొంగలించలేరని, కావున ప్రతి ఒక్కళ్ళు బాగా చదివి ఉన్నత స్థితికి సమాజానికి ఆర్యవైశ్యులకి మంచి సేవలు అందించాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కందుకూరు మండల ఆర్యవైశ్య కన్వీనర్ మురారి శెట్టి సుధీర్ కుమార్, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రెసిడెంట్ కోట వెంకట నరసింహం, కోటా కిషోర్, కంకణాల వెంకటేశ్వర్లు, కాకుమాని ప్రవీణ్ కుమార్, శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ రవ్వా అరుణ, సెక్రటరీ పబ్బిశెట్టి వెంకట సురేష్, ట్రెజరరీ జయవరపు కనకమహాలక్ష్మి, సొసైటీ అడ్వైజరి మెంబర్స్ వెంకట సాయిలక్ష్మి, వెంకట సాయి దుర్గ, ఈసి మెంబర్ ఇన్నమూరి శ్రీనివాసులు, కోట వెంకటేశ్వర్లు, తదితర ఆర్యవైశ్య మిత్రులు పాల్గొన్నారు.







# సబ్సిడీతో కూడిన రుణం అందించి తోడ్పడండి తహసిల్దార్‌కు వినతి



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 7)**

మే 2 వ తేదీన భారీవర్షం, పిడుగుపాటుకు గురై కనిగిరి మండలం పోలవరం పంచాయతీ నిమ్మ మహేశ్వరపురం నివాసి నూకతోటి శివపార్వతి భర్త లక్ష్మయ్య కు చెందిన 20 మేకలు మృతి చెందాయి. చనిపోయిన మేకల విలువ ఐదు లక్షల వరకు ఉంటుంది. పిడుగుపాటుకు మొత్తం 20 మేకలు చనిపోవడంతో తమకు బ్రతుకు దెరువు లేకుండా పోయిందని, తాము అప్పులపాలయ్యామన్నారు. కావున చనిపోయిన మేకకు 25000 రూపాయలు వంతున 50% సబ్సిడీతో 5 లక్షలు రుణం అందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలసినదిగా తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పీవీ శేషయ్య, శాలివాహన సంఘం నాయకులు ఆలమూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# చెత్త నుండి సంపద తయారీకి చర్యలు

**(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, మే 7)**

మండలంలోని పి నాయుడుపాలెం గ్రామపంచాయతీ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నందు సిగ్రిగేషన్ గ్రామపంచాయతీలో ఏ విధంగా జరుగుతుంది, ఇక్కడ ఏ విధంగా సంపద నుండి చెత్త తయారు చేయబడుతుంది అనే దాని పై మాజీ సర్పంచ్ కూరాకుల కరుణాకర్‌రెడ్డి సదరు చెత్త నుండి సంపద తయారీ కేంద్రం ముందు సెక్రెటరీ పి శంకర్ తీసుకున్న చర్యల గురించి మాజీ సర్పంచ్ తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కేంద్రం ముందు సేంద్రియ పద్ధతిలో పెంచిన కూరగాయల మొక్కలను చూసి సర్పంచ్ ఆనందం వ్యక్తం చేశారు. ఇక్కడ ఇంకా ఏమి సహాయ, సహకారం కావాలన్నా నా వంతు సహాయం నేను చేస్తాను అని ఎక్స్ సర్పంచ్ తెలిపారు .ఇక్కడ పనిచేయుచున్న గ్రీన్ అంబాసిడర్ పొదలకూరి కోటయ్యని, కోడలి అంజయ్యని అభినందించారు. ఇంత బాగా చెత్త నుండి అభివృద్ధి చేసిన కోటయ్య, అంజయ్య వారి గురించి కరుణాకర్‌రెడ్డి తన అభినందనలు తెలియజేశారు. మన జిల్లాలో ప్రతి గ్రామపంచాయతీ ఉండాలని, మన మాజీ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి తన భావాలకు అనుగుణంగా పి నాయుడుపాలెం గ్రామపంచాయతీ అభివృద్ధి చెందాలని అలాగే గ్రామ ప్రజలు ప్రతి విభాగంలో వాళ్ళు ముందుకు పోవాలని మన పంచాయతీ రాష్ట్రంలో ఎందుకు మోడల్ ఉండకూడదు అని కరుణాకర్ రెడ్డి కోరుకుంటున్నారు .ఆ విధంగా సెక్రెటరీకి ప్రస్తుత సర్పంచ్ కరుణ ప్రియకి తన అభిప్రాయం తెలియజేశారు. ఇలాగే ప్రతి గ్రామపంచాయతీలో ప్రతి ఒక్క పౌరుడు సంబంధమైన మన రాష్ట్రాన్ని గురించి మన అభివృద్ధి గురించి ఆయన తన యొక్క అభిప్రాయాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గారు మరియు గ్రామ నాయకులు కూరాకుల కరుణాకర్ రెడ్డి , అంజి రెడ్డి , కూరాకుల సుబ్బారెడ్డి , గొర్రె ముచ్చు తిరపతి స్వామి , ఇస్తర్ల ఏడుకొండలు, తమ యొక్క అభిప్రాయాలు తెలియజేశారు . సీఎం ఆదేశాల మేరకు అందరూ సంపద తయారీ కేంద్రంలో అభివృద్ధి చేయాల్సిందిగా, దాన్ని ఇంకా ఇంకా మన గౌరవ మాజీ సర్పంచికి కరుణాకర్ రెడ్డి తెలియజేశారు. ఇలాగే మన స్పందన స్వచ్ఛంద 2025 లో మన ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం గ్రామపంచాయతీ, పి నాయుడుపాలెం గ్రామపంచాయతీ ప్రథమ స్థానంలో ఉండాలని కూరాకుల కరుణాకర్ రెడ్డి తెలిపారు.




# టెన్త్ మెరిట్ విద్యార్థులకు పురస్కారం




**(షణ్ముఖ వెలుగు, కంభం, మే 7)**

గత మార్చిలో జరిగిన, ఎస్ఎస్సి పబ్లిక్ పరీక్షలందు, అత్యధిక మార్కులు సాధించిన, కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు మండలాల కాపు సామాజిక వర్గానికి చెందిన 9 మంది మెరిట్ విద్యార్థులను, శ్రీకృష్ణదేవరాయ బలిజ సేవా సంఘం వారు, తమ సంఘ కార్యాలయంలో దుశ్శాలువ, మెమెంటోలతో సత్కరించారు. ఏబీసీ మండలాలకు చెందిన, కాత్వా యూనిట్ వారు, ఒక్కో విద్యార్థికి, 500 రూపాయల ప్రోత్సాహక నగదు బహుమతిని అందజేశారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ ఇదే తరహాలో, ఇంటర్మీడియట్ నందు కూడా, మరిన్ని ఉత్తమ మార్కులను సాధించి, తల్లిదండ్రులకు సామాజిక వర్గానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం అధ్యక్షుడు తోట కోటేశ్వరరావు, కార్యదర్శి. రఘువీర్, గౌరవ అధ్యక్షులు డాక్టర్ పులి శ్రీనివాస ప్రసాద్, కాసుల పాండు, ఉపాధ్యక్షులు సురే ప్రసాద్, కురంగి మల్లికార్జున, సిరిగిరి కొండలరావు, ఓ సి హెచ్ నరసింహులు, మామిళ్ల చంద్రశేఖర్ విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# కావలిలో వైసీపీకి షాక్



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 7)**

కావలి 29వ వార్డ్ వైసిపి ఇంచార్జ్ పెనుమల్లి అశోక్ బుధవారం పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలు చేరారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఆయనకు కండువా గప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని ఈ సందర్భంగా ఆయనకు హామీ ఇచ్చారు.

# టు వీలర్ మెకానిక్ కార్మికులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

## కార్మిక శాఖ మంత్రిని కోరిన ఏపీ టూ వీలర్ అసోసియేషన్ నాయకులు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 7)**

గుడివాడలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగళ్ళ రాము ఆధ్వర్యంలో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ , ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పామర్రు ఎమ్మెల్యే కుమార్ రాజకి కలిసిన ఆంధ్రప్రదేశ్ టూ వీలర్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దాయనేని ధర్మ ఫౌండర్ షేక్ అసిఫ్ అలీ ట్రెజరర్ షేక్ జుబేర్..విరు ఆంధ్రప్రదేశ్లో మెకానికులు పడుతున్న ఇబ్బందులను కార్మిక శాఖ మంత్రి గారి దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది. అలాగే మెకానికులకు కార్పొరేషన్ కూడా ఏర్పాటు చేసి మెకానిక్ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. కార్మిక శాఖ మంత్రి మాట్లాడుతూ మెకానికుల విషయాలన్నీ నా దృష్టికి వచ్చాయి నేను మీ సమస్యలను పరిష్కరిస్తాను అని చెప్పి చెప్పడం జరిగింది గుంటూరు జిల్లా వైస్ ప్రెసిడెంట్ షేక్ ఈసా గుంటూరు టౌన్ ప్రెసిడెంట్ షేక్ గౌస్ సెక్రెటరీ ఆంజనేయులు ట్రెజరర్ బుడే గుంటూరు జిల్లా మాజీ ట్రెజరర్ మల్లికార్జునరావు, ఏలూరు జిల్లా నుండి త్రినాధ్ , కృష్ణాజిల్లా నుండి బంటుమిల్లి ప్రెసిడెంట్ బాజీ,ముదినేపల్లి సెక్రటరీ ఫణి, పెడన జానీ. పామర్రు రామాంజనేయులు,ఉయ్యూరు పిఎన్ ఖాన్, గుడ్లవల్లేరు సురేంద్ర, గుడివాడ అన్సారి, కలిదిండి ప్రసాద్, కృష్ణాజిల్లా నుంచి కృష్ణాజిల్లా అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు అంకాల సుబ్బారావు, మచిలీపట్నం దణేష్, ఎన్టీఆర్ జిల్లా నుండి విజయవాడ అసోసియేషన్ కడలి ప్రసాద్, ఇంకా కొంతమంది మెకానిక్ సోదరులు పాల్గొన్నారు.



# ఘనంగా మండలంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 7)**

పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారిని కోరిన కోరికలు తీర్చే దైవంగా ఆరాధిస్తారు. స్థానిక మండల కేంద్రమైన పొన్నలూరు లో ఎన్టీఆర్ కూడలి వద్ద వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం, మాలపాడు మరియు చౌటపాలెం గ్రామాలలోని బ్రహ్మంగారి దేవాలయంలో బుధవారం శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా భక్తులు కీర్తనలు, భజనలు చేసి స్వామివారికి అభిషేకాలు, అర్చనలుచేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రాత్రి సమయంలో గ్రామాలలో స్వామివారిని వీధి వీధికి మేళతాళాలతో, తప్పెడలతో, దీపముల కాంతితో ఊరేగింపుతో ఉత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాలెపాడు గ్రామంలో బ్రహ్మంగారి తిరునాళ్ల సందర్భంగా విద్యుత్ ప్రభను లను ఏర్పాటు చేశారు. మాలపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ వారు నిర్వహించిన విద్యుత్ ప్రభ ను ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, వైసీపీ వారు ఏర్పాటుచేసిన విద్యుత్ ప్రభ ముఖ్యఅతిథిగా కొండపి, నియోజకవర్గ కన్వీనర్ ఆదిమూలపు సురేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాలను భక్తులు మండలంలో ప్రజలు పాల్గొన్నారు.



# అన్నదాత సుఖీభవ ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 7)**

వ్యవసాయ శాఖలో ప్రతిష్టాత్మకంగా అన్నదాత సుఖీభవ కార్యక్రమం యొక్క ఆన్లైన్ ప్రక్రియ ప్రారంభమైందని, మొత్తం 10,519 రికార్డులు పంపించడం జరిగిందని అగ్రికల్చర్ ఏవో బి తిరుమల జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. అన్నదాత సుఖీభవ క్రింద ఏడాదికి రూ. 14,000లు రైతు ఖాతాల్లో జమ అవ్వడం జరుగుతుంది. కావున అన్ని గ్రామాల్లోని రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలు వద్దకు వెళ్లి తమరి రికార్డు కరెక్ట్‌గా ఉందో లేదో, ఏమైనా తప్పులు ఉన్నాయా వెరిఫై చేసుకోవాల్సిందిగా కోరారు. కరెక్ట్‌గా ఉంటే రికార్డు వెంటనే అప్రూవల్‌కి పంపించ బడుతుందని ఏమైనా తప్పులు ఉంటే ఆయా రికార్డులను మండల తహసిల్దార్ వారికి కరెక్షన్స్ నిమిత్తం పంపించబడుతుందన్నారు. అందువలన రైతులు వెంటనే రైతు సేవా కేంద్రాలు వద్దకు వెళ్ళవలసినదిగా అగ్రికల్చర్ ఏవో బి తిరుమల జ్యోతి ఒక ప్రకటనలో తెలియజేశారు.

# ప్రత్యేక అలంకరణలో గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి

## భక్తిశ్రద్ధలతో జరిగిన బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవం



**(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, మే 7)**

గోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 332వ ఆరాధన మహోత్సవం ను గ్రామాలలోని బ్రహ్మంగారి ఆలయాలలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశ్వా వసునామ వైశాఖ శుద్ధ దశమి బుధవారం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవంను పురస్కరించుకొని గ్రామాలలోని బ్రహ్మంగారి భక్తులు ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులందరూ స్వామివారిని దర్శనం చేసుకుని కానుకలు సమర్పించుకొని మొక్కలు తీర్చుకున్నారు. వచ్చిన భక్తులందరికీ ఆలయ నిర్వహకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. బ్రహ్మంగారిమఠంలో జరిగే ఆరాధన మహోత్సవానికి ఈ ప్రాంతంలోని బ్రహ్మంగారి భక్తులు మాల ధారణ చేసి దీక్ష పూర్తి చేసుకుని బ్రహ్మంగారి మఠం వెళ్లారు.



# గ్రావెల్, ఇసుక అనేక బాడుగలు తోలించుకొని డబ్బులు ఇవ్వలేదు

## శ్రీకరి విల్లాస్ ఎదుట బాధితుడి ఆవేదన








(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 7)
మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఆయన వియ్యంకుడు కొండ భాస్కర్ రెడ్డి ఒంగోలు సమీపంలో శ్రీకరి విల్లాస్ కడుతున్నారు. అయితే ఆ విలాస్ నిర్మాణ పనులకు సంబంధించి అజయ్ అనే వ్యక్తి వారి లారీల ద్వారా గ్రావెల్, ఇసుక అనేక బాడుగలు తోలించుకొని డబ్బులు ఇవ్వలేదని ఆ విల్లాస్ ఎదుట బాధితుడైన అజయ్ వారి కుటుంబ సభ్యులతో బైఠాయించారు. తమకు మూడు లారీలు, ఒక క్రేన్ ద్వారా విల్లాస్ పనులు చేసినట్లు వాటికి సంబంధించి 57 లక్షలు డబ్బులు ఇవ్వకుండా ఎగ్గొట్టారని, అడిగితే సమాధానం చెప్పకుండా భాస్కర్ రెడ్డి వ్యవహరిస్తున్నారని ఆ వ్యక్తి ఆవేదన వ్యక్తం వేశారు. లారీ ఫైనాన్స్ కట్టకపోవడంతో లారీలు కూడా ఫైనాన్స్ వారు స్వాధీనం చేసుకున్నారని, తమ కుటుంబం పూర్తిగా రోడ్డు మీద పడిందని ఆయన ఆందోళనకు గురయ్యారు. భాస్కర్ రెడ్డికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఫోన్ ఎత్తడం లేదని, అందుకని విల్లాస్ దగ్గరకు కుటుంబ సభ్యులతో వచ్చి ఆ వ్యక్తి అక్కడ వాపోయారు. తమ పిల్లలకు స్కూల్ ఫీజులు కూడా కట్టలేని పరిస్థితిలో ఉన్నామని, తమకు న్యాయం చేయాలని అజయ్ కోరారు. చేసిన పనులకు సంబంధించి అన్ని బిల్లులు తమ దగ్గర ఉన్నాయన్నారు. తమకు న్యాయం చేసేంత వరకు ఇక్కడే నుంచి కదిలే పరిస్థితి లేదని తేల్చి చెప్పారు.

# విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 7)
విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగ నిరతిని అందరూ గుర్తెరిగి వారి వారి బాధ్యతల పట్ల మరింత కార్యోన్ముఖులు కావాల్సిన అవసరం ఉందని జిల్లా జాయింట్ కలెక్టర్ కె కార్తీక్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్లోని ఎస్ ఆర్ శంకరన్ హాల్లో అమరవీరుడు, స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి జె సి కార్తీక్, డి ఆర్ ఒ ఉదయభాస్కర్, సెట్నెల్ సి ఇ ఒ నాగేశ్వరరావు పూలమాలలతో ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు లాంటి త్యాగధనుల ఫలితంగా వచ్చిన స్వాతంత్రాన్ని కాపాడుకునే దిశగా ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్లోని వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

# పహల్గామ్ ఉగ్రదాడికి గట్టి బుద్ధి చెప్పిన ఆపరేషన్ సింధూర్

## బీజేపీ జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ కుమార్

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 7)
భారతదేశానికి విరోధంగా కుట్రలు పన్నుతూ ఉగ్రవాదులకు ఆశ్రయం ఇచ్చే పాకిస్తాన్‌కి ఈ దాడి గట్టి హెచ్చరిక అని బిజెపి జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ అన్నారు. పహల్గామ్ దాడిలో భర్తలను కోల్పోయిన ప్రతి భార్య నుదిటి సింధూరాన్ని చెరిపివేసిన ఉగ్రవాదుల తీరుకు భారత సైన్యం ఘాటైన ప్రతీకారం తీర్చిందనీ ఇది నయా భారత్'. కళ్ల ముందే కలల్ని ధ్వంసం చేసిన వారికి ఇదే సమాధానం. ఆపరేషన్ సింధూర్ విజయవంతంగా నిర్వహించిన భారత భద్రతా దళాలకు నా హృదయపూర్వక అభినందనలు. తెలియజేశారు. వీర జవాన్ల ధైర్యానికి, సమర్థతకు జోహార్లుఉగ్రవాదుల కవ్వింపు చర్యలకు మౌనంగా ఉండే రోజులు పోయాయినీ భారత్ కన్నెర్ర చేస్తే పాకిస్తాన్ నేలమట్టమవుతుంది అనే విషయాన్ని భారత సైన్యం మరోసారి నిరూపించిందన్నారు. ఈ విజయం దేశ ప్రజలందరికీ గర్వకారణం అని అన్నారు.



# వైభవంగా శ్రీ వాసవి మాత జయంతి వేడుకలు



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 7)
శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు కందుకూరు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం వాసవి నగర్ వద్ద నుంచి 102 ఆర్యవైశ్య మహిళలచే కలిశాల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. మేళ తాళాలతో జై వాసవి మాత నినాదాలతో వందలాది మంది ఆర్యవైశ్యులు ఊరేగింపుగా పెద్ద బజారు నందు ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అంతకుముందు వాసవి నగర్ వద్ద 102 కలిశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్గమధ్యంలో అమ్మవారికి వారు పోసి కొబ్బరికాయలు కొట్టి అమ్మవారికి స్వాగతం పలికారు. అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి, మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. 102 కలిశాలతో తీసుకొచ్చిన పవిత్ర జలాన్ని భక్తుల చేతులు మీదుగా ఆలయ అర్చకులు బాలయ్య స్వామి, రాజా స్వామి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. శ్రీ వాసవి అమ్మవారి మూలవిరాట్ ను, అమ్మవారి ఆలయాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు వాసవి మాత మూల మంత్ర జప హెూమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు అన్న ప్రసాద వినియోగం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ కోట వెంకట నరసింహం, గౌరవ అధ్యక్షులు కొత్త వెంకటేశ్వర్లు, గౌరవ ప్రధాన కార్యదర్శి నల్లమల్లి వెంకటేశ్వర్లు, ఆలయ ప్రధాన కార్యదర్శి ఇన్నమూరి నరసింహ, ఆలయ కమిటీ సభ్యులు, ఆర్య వైశ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# జిల్లా కేంద్ర గ్రంథాలయంలో యోగా క్లాసులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 7)
జిల్లా కేంద్ర గ్రంథాలయం ఒంగోలు నందు (బుధవారం)న ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ శాఖ ఆధీనంలో తేది.28.04.2025 నుండి తేది.06.06.2025 వరకు జరుగుతున్న వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా 9వ రోజు కార్యక్రమాలకు 102 మంది విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు. బుధవారం రోజు కార్యక్రమంలో టి శ్రీనివాసరావు యోగా క్లాస్ లో మండుకాసనము, తడాసనము, వజ్రాసనం మొదలగు ఆసనాలు పిల్లలకు నేర్పించటం జరిగింది. అనంతరం గ్రంథాలయ సిబ్బంది చే పిల్లలకు పుస్తకాలు ఇచ్చి చదివించటం జరిగింది. తదుపరి కాలూరి కాశీ విశ్వనాథ్‌చే పిరమిడ్ ధ్యానం, పిల్లలకు కథలు చెప్పటం జరిగింది. అనంతరం వి వెంకయ్య, విశ్రాంత ఉద్యోగులు వారిచే స్పోకెన్ ఇంగ్లీషులో సెంటెన్సెస్ గురించి బోధించారు. యం.సూర్య కుమారి, రచయిత్రి పిల్లలకు తెలుగు లిపి నందు అవగాహన కల్పించారు. స్పేర్ టీం ఆక్టివిటీస్ లో దాసరి ప్రసాద్ పిల్లలతో మైండ్ గేమ్ , పజిల్స్ ఆడించారు. సృష్టి ఆర్ట్స్ అకాడమీ వారు టి.రవీంద్ర , శిరీషచే డ్రాయింగ్ క్లాస్ లో అందమైన చిత్రాలు, బొమ్మలు గీయటం నేర్పించారు. వేసవి విజ్ఞాన తరగతులను ఉప గ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి కూడా గ్రంథాలయంలో సభ్యత్వం తీసుకోవాలని, సభ్యత్వం తీసుకోవటం వలన గ్రంథాలయం లో ఉన్న పుస్తకాలు చదవొచ్చని, తద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు.






# భారీ వర్షం, ఈదురు గాలులకు కుప్పకూలిన రేకుల షెడ్డు

## షెడ్డును పరిశీలించిన తహసీల్దార్ వెంకటేశ్వరరావు

(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, మే 7)
జిల్లాలోని ఇటీవల పడుతున్న వార్షాలు బీభత్సం కావడంతో మంగళవారం పుల్లలచెరువు మండలకేంద్రంలోని భారీవర్షం బలమైన ఈదురు గాలులుతో బీభత్సం కావడంతో యర్రగొండపాలె రోడ్డులో గల ఎంపిడిఓ ఆఫీస్ పక్కనే ఉన్న మల్లాపాలెం పకీర్ సహెబ్ అనే వ్యక్తి రేకులు షెడ్డు ఒక్క సారిగా కుప్పకూలింది. ఆ రేకుల షెడ్డులో పకీర్‌తో పాటు మరో ఏడుమంది ఉన్నారు. కానీ ప్రమాదవశాత్తు ఎవ్వరికి ప్రాణనష్టం జరగలేదు. అందులోని రేషన్ బియ్యం ఇంకా కట్టు బట్టలు పూర్తిగా వర్షానికి తడిచిపోయి తల దాచుకునేందుకు ఏదారి లేక పక్కనే ఉన్న చిన్న గవర్నమెంట్ ఆఫీసు గదిలోకి వెళ్ళి తలదాచుకున్నామని, కుటుంబ యజమాని తెలిపాడు. అంతేగాక నిత్యవసర సరుకులు నేలపాలై పోయయని ఆ కుటుంబం బోరున ఎడవడంతో అందరిని కలిచి వేసింది. ఈ విషయం వెంటనే బుధవారం మండల తహసీల్దార్ వెంకటేశ్వరరావుకు దృష్టికి తీసుకు పోవడంతో వెంటనే ఆయన స్పందించి కూలిన ఇంటి వద్దకు వెళ్ళి పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తానని ఆయన అన్నారు. ఆ కుంటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని ఆయన ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక వీఆర్వో, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



